ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 17, అక్టోబరు 2025

పేదల పెద్దాసుపత్రికి నిర్లక్ష్యపు రోగమొచ్చింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే బాధితులకు వైద్యం గగనమైంది. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రాణాలు పోతున్నాయన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ప్రత్యేకించి అత్యవసర విభాగం క్యాజువాలిటీ విధులు కాలక్షేపంగా మారాయి. దీంతో పెద్దాసుపత్రికి వచ్చే రోగులకు భరోసా కరువైంది. రోగంతో రొప్పుతూ.. వచ్చే వారిని నర్సులు పట్టించుకోవడం లేదు. సూది మందు కాదు కదా.. కట్టుగుడ్డ కూడా కట్టని పరిస్థితి క్యాజువాలిటీలో కనిపిస్తోంది. అదేమని అడిగిన వారికి సూదులు మా డ్యూటీ కాదంటూ నర్సులు నిర్లక్ష్యపు సమాధానమిస్తుండగా, ఇక రాత్రివేళలో డ్యూటీలో ఉన్న మెడికోలే రోగులకు సూదులు వేయాల్సిన దుస్థితి నెలకొంది.




జీజీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం

అత్యవసర విభాగంలో మెడికోలే ఆధారం

సేవలు తూతూమంత్రం!

- పేషెంట్ల పట్ల నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం
- సూది వేయడానికి డాక్టర్లే దిక్కు
- వార్డులో బాధితుల గోడు ఆలకించేవారు కరువు
- మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే హెచ్చరించినా అదే తీరు



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల ప్రభుత్వ ఆసుపత్రి జీజీహెచ్‌లో వైద్య సేవలు మొక్కుబడిగా మారాయి. పేరుకు పెద్దాసుపత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడ కనీసం గాయమైతే కట్టుకట్టేవారు కనిపించడం లేదు. వార్డులో వారాల తరబడి చికిత్స పొందున్న రోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వైద్యసిబ్బంది చీదరింపులు ఎక్కువయ్యాయి. రోగంతో తాము పడే బాధను కనీసం ఆలకించడం లేదని పలువురు వాపోతున్నారు. జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం దేవుడెరుగు, కనీసం రోగుల పట్ల కనికరం చూపితే చాలు అని పలువురు బాధితులు

పేరుకే పెద్దాసుపత్రి

ఆసుపత్రికి వివిధ రోగాలతో బాధపడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వెయ్యి మందికిపైగా వస్తుంటారు. అయితే అందులో వందమందికిపైగా ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి కనిపిస్తుండగా, ఆసుపత్రిలో చేరిన తర్వాత పట్టించుకునేవారు కరువైపోతున్నారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఒకటీ రెండు సార్లు తనిఖీలు చేయగా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ అనేకసార్లు తనిఖీలు చేసి, లోపాలను సవరించుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా పేదల ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందించడానికి అవసరమైన కృషి చేస్తున్నామని తెలిపారు. పూర్వ కలెక్టర్ తమీమ్ అన్సారియా అకస్మికంగా అర్ధరాత్రి వేళ తనిఖీలు నిర్వహించి, సిబ్బంది పనీరుపై సీరియస్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. పాలకుల హెచ్చరికలను సైతం అయితే ఇక్కడ సిబ్బంది మాత్రం పెడచెవిన పెడుతున్నారు. ముఖ్యంగా రోగులపట్ల నర్సుల చూపుతున్న వివక్ష, చీదరింపులు మరింత శ్రుతిమించాయి. కనీసం రోగుల పట్ల కనికరం, ప్రేమ చూపకపోవడంతో జీజీహెచ్ అంటేనే భయపడే పరిస్థితి కనిపిస్తోంది.

మిగతా 4లో...

కర్నూలులో జిల్లా నేతల సందడి

- జీఎస్టీ సభకు హాజరు
- మంత్రాలయం గుడిలో పూజలు
- ఎగువ ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా భారీగా తరలిన జనం
- దోర్నాల వద్ద శ్రీశైలం వెళ్లే వాహనాలు నిలిపివేత
- గిద్దలూరు ఘాట్‌రోడ్డులో ఇక్కట్లు
- రూ.70కోట్ల కనిగిరి బైపాస్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ
- మంత్రి స్వామి పర్యటనలో గందరగోళం


మంత్రాలయంలో ఉమ్మడి జిల్లా నేతలు

ఒంగోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న జీఎస్టీ అవగాహన సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతలు హాజరయ్యారు. మరోవైపు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి కూడా పెద్దసంఖ్యలో జీఎస్టీ లబ్ధిదారులు కూడా స్థానిక అధికారుల సూచనలతో హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణల అనంతరం భారీ సభను తొలుత కర్నూలులో ఏర్పాటుచేయగా సీఎం చంద్రబాబు దానిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సమీపంలో ఉన్న మన జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలు ఆ సభలో పాల్గొనడంతోపాటు ముందస్తు ఏర్పాట్లు కూడా చూడాలన్న అధిష్ఠానం ఆదేశాలతో కీలక నేతలంతా నాలుగు రోజులుగా అక్కడే మకాం వేసి ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, బీఎన్ విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు ఈ ఏర్పాట్లలో పాల్గొన్నారు. గురువారం జరిగిన ప్రధాని సభకు కూడా వారంతా హాజరయ్యారు. బీజేపీకి చెందిన 20 సూత్రాల పథకం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌తోపాటు మరికొంతమంది ముఖ్యనేతలు సభకు హాజరుకావడంతోపాటు సందడిగా గడిపారు. మంత్రి గొట్టిపాటి ఇతర ఎమ్మెల్యేలు గురువారం ఉదయం మంత్రాలయంలో రాఘవేంద్రస్వామిని దర్శించుకొని పూజలు చేసి మధ్యాహ్నం సభకు హాజరయ్యారు.

భారీగా ఏర్పాట్లు.. ట్రాఫిక్ మళ్లింపు

మరోవైపు జిల్లా నుంచి దాదాపు 600 మంది జీఎస్టీ లబ్ధిదారులను అధికారులు బస్సుల ద్వారా పశ్చిమ ప్రాంతానికి చెందిన వారిని సభకు పంపారు. పల్నాడు నుంచి ఎగువ ప్రాంతాల ప్రతినిధులు కూడా బస్సులలో కర్నూలుకు బయలుదేరిన వారికి మార్కాపురం, గిద్దలూరులలో విశ్రాంతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఇక ప్రధాని శ్రీశైలం పర్యటన నేపథ్యంలో పోలీసుల నుంచి బందోబస్తుకు భారీగా వెళ్లారు. ప్రధాని శ్రీశైలం పర్యటన ముగిసే వరకు అటువైపు వెళ్లే వాహనాలను దోర్నాలలో నిలిపివేశారు. కర్నూలు వెళ్లే వాహనాలను కుంట నుంచి గిద్దలూరు వైపు మళ్లించారు. అయితే గిద్దలూరు ఘాట్‌రోడ్డులో

మిగతా 4లో...



కర్నూలు వెళ్లే జీఎస్టీ లబ్ధిదారులకు మార్కాపురంలో ఏర్పాట్లు సమీక్షిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

- గ్రామాల వారీగా గుర్తించేందుకు చర్యలు
- ఆ స్థలాలను రెవెన్యూ, పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు
- కలెక్టర్ ఆదేశాలతో కదలిన పంచాయతీ అధికారులు


చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

పంచాయతీ స్థలాల ఆక్రమణలపై దృష్టి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామపంచాయతీల్లో విలువైన స్థలాలను కాపాడుకునేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో పంచాయతీలకు చెందిన స్థలాలు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. పంచాయతీ ఆస్తులను పరిరక్షించుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉత్తర్వులు జారీ చేసింది. తదనుగుణంగా జిల్లాలో ఆ స్థలాల పరిరక్షణ కోసం ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకున్న పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఇటీవల కలెక్టర్ రాజాబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంచాయతీలకు సంబంధించి ఆస్తులను కాపాడేందుకు తీసుకోవాల్సిన పలు అంశాలపై ఆ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో తదనుగుణంగా జిల్లాలోని 729 గ్రామపంచాయతీల్లో ఆయా పంచాయతీలకు సంబంధించిన ఆస్తుల వివరాలను బయటకు తీస్తున్నారు. ఇప్పటికే పంచాయతీలకు సంబంధించి ఆస్తులు కొంత పంచాయతీల ఆధీనంలో ఉండగా మరికొంత విలువైన స్థలాలు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి.

వివరాల సేకరణలో అధికారులు

అధికారులు ఒక ప్రొఫార్మా రూపొందించి పంచాయతీల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాల వారీగా ఆ పంచాయతీకి ఎంత భూమి ఉంది, ప్రస్తుతం పంచాయతీ ఆధీనంలో ఎంత స్థలం ఉంది, ఎంత ఆక్రమణదారుల చేతిలో ఎంత ఉంది, వారెవరు? తదితర వివరాలన్నింటిని రూపొందించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆక్రమణదారుల నుంచి ఆ స్థలాలు, భూములను స్వాధీనం చేసుకునేందుకు అవకాశం ఉందా? లేదా? అనే అంశాలను కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో ఆయా పంచాయతీలకు సంబంధించి ఆస్తుల వివరాలు కొంత

మిగతా 4లో...

పాకల తీరానికి అభివృద్ధి హారం..!

- పర్యాటకంపై మంత్రి స్వామి ప్రత్యేక దృష్టి
- ఆయన చొరవతో పాకల, ఊళ్లపాలెం వద్ద రూ.కోటికిపైగా అభివృద్ధి పనులు పూర్తి
- సెంట్రల్ లైటింగ్, రోడ్లు, రిటైనింగ్‌వాల్ నిర్మాణం
- ఆనందాన్ని వ్యక్తంచేస్తున్న మత్స్యకారులు



సింగరాయకొండ మండలంలోని పాకల తీరం పర్యాటక శోభను సంతరించుకుంటోంది. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడాదిన్నరలోనే రూ.కోటికిపైగా పనులు పూర్తయ్యాయి. పాకల తీరంలో రూ.25 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణంతోపాటు సెంట్రల్ లైటింగ్‌ను ఆధునీకీకరించారు. రూ.15 లక్షలతో బేవాచ్ టవర్ ఏర్పాటు చేశారు. చెల్లమ్మగారి పట్టపుపాలెం తీరంలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఊళ్లపాలెం తీరం వద్ద రూ.40 లక్షలతో రోడ్లు, రిటైనింగ్ వాల్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేశారు. పార్కు నిర్మాణానికి అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. మున్ముందు మరిన్ని పనులు చేపట్టనున్నారు. దీంతో తీరప్రాంతం సరికొత్త అందాలను సంతరించుకుంటోంది.

సింగరాయకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పర్యాటక రంగం పడకేసింది. జగన్‌రెడ్డి జమానాలో తీరప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించిన నాథుడే కరవయ్యాడు. కొత్తగా అభివృద్ధి అటుంచి పాకల తీరంలో గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4కోట్లతో ప్రారంభించి సగభాగం పూర్తిచేసిన టూరిజం రెస్టారెంట్‌ను సైతం వైసీపీ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసింది. దీంతో ఆ భవనం ఇనుప సామగ్రి అంతా తుప్పుపట్టిపోయింది. నాడు నిర్లక్ష్యానికి గురైన తీరప్రాంత అభివృద్ధి ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో పరుగులు పెడుతోంది. పాకల నుంచి ఊళ్లపాలెం బీచ్ వరకూ సుమారు 3 కి.మీ దూరం అభివృద్ధికి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయిస్తున్నారు. ఏడాదిన్నరలోనే రూ.కోటికిపైగా నిధులతో పనులు పూర్తయ్యాయి. పాకల తీరంలో రూ.25 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణంతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. చెల్లమ్మగారి పట్టపుపాలెం తీరంలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మించారు. మున్ముందు మరిన్ని పనులు చేపట్టనున్నారు.

వినూత్న ఆలోచనతో బేవాచ్ టవర్ నిర్మాణం

పాకల తీరంలో జరిగిన కొన్ని ప్రమాదాల్లో కొంతమంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. అవి మంత్రి స్వామిని తీవ్రంగా కలచివేశాయి. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యాటకుల భద్రత, పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడానికి వినూత్నంగా ఆలోచించారు. పర్యాటకులను అప్రమత్తం చేయడానికి తీరంలో

మిగతా 4లో...

పేదరిక నిర్మూలన దిశగా..

- ఆలస్యంగా పడుతున్న అడుగులు
- జిల్లాలో లక్షకుపైగా పేద కుటుంబాలు
- నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం

5

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- గురుకులాలు, వసతిగృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు ఖర్చు
- దూపాడు పాఠశాల ఆకస్మిక తనిఖీలో మంత్రి స్వామి వెల్లడి


గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

త్రిపురాంతకం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యనందించటంతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం మండలంలోని దూపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక వైద్యాధికారిని నియమించామన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. అందులో

మిగతా 4లో...

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- మరొకరికి షోకాజ్ నోటీసు జారీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే.లతీఫ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజాబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లతీఫ్ చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో ఉపాధి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులను రూ.1.23 లక్షలను దుర్వినియోగం చేసినట్లు విచారణ నివేదిక ఇచ్చారు. ఈ విచారణ నివేదికను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు లతీఫ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు పంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తికి షోకాజ్ నోటీసును జారీచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. దొడ్డవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఒక ప్రైవేటు పెట్రోలు బంకు ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి చర్చ లేకుండా పంచాయతీ తీర్మానం చేసి నిర్వాహకులకు ఇచ్చినట్లు నిర్ధారణ కావడంతో తదనుగుణంగా షోకాజ్ నోటీసు జారీచేశారు.

సూపర్ జీఎస్టీతో తగ్గిన వాహనాల ధరలు

- డిప్యూటీ కమిషనర్ సుశీల
- రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల చిన్న వాహనాల ధరలు తగ్గినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. గురువారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డు నుంచి బాపూజీ కాంప్లెక్స్ వరకు సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఆధ్యరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ రవాణాకు వినియోగించే స్మాల్ వెహికిల్స్‌పై జీఎస్టీ 28 శాతం నుంచి 18శాతం వరకు తగ్గించారన్నారు. ఆటోరిక్షా, మోటార్ కారు, క్యాబ్స్, లారీలు, బస్సులు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గించడం తోపాటు 5నుంచి 12శాతం వరకు రాయితీ ఉంటుందని చెప్పారు. గతంలో రూ.9.80 లక్షలు ఉన్న మినీ ట్రక్కుకు తగ్గించిన జీఎస్టీ 10శాతం ప్రమాదకం రూ.2.75లక్షలు, అదే వాహనంపై పన్ను రాయితీ రూ.1.4లక్షలు ధర తగ్గుతుందన్నారు. చిన్న వాహనాలు గతం కంటే 50 శాతం ధరలకే వాహనాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్డీవో కళావతి, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ డి.సత్యప్రకాష్ పాల్గొన్నారు.


ర్యాలీ ముందుభాగాన మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుశీల

మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ..!

రైతుల నుంచి అరువుపై సరుకు కొనుగోలు

గోడౌన్‌లో నిల్వ ఉంచి బ్యాంకులో రుణం

గుట్టుగా విక్రయం.. అక్రమ తరలింపును అడ్డుకున్న రైతులు

మార్టూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు.. రైతుల నుంచి అరువుపై కొనుగోలు చేసిన పంటను వారికి తెలియకుండా బ్యాంకులో కుదవపెట్టినట్టు చూపి గుట్టుగా సరుకు దాటించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసి బాధిత రైతులు అడ్డుకున్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో వరికల్లు నాగేశ్వరరావు అలియాస్ నాగు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగుతోంది. ఆయన మూడు నెలల క్రితం రైతుల వద్ద నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి కొనంకిలోని తన గోడౌన్‌లో నిల్వ చేసుకున్నాడు. అనంతరం రైతులకు నగదు చెల్లించకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రైవేటు ఆన్‌లైన్ ప్రైవేటు సంస్థతోపాటు తాను బాకీ ఉన్న కొంతమందికి సరుకును స్వాధీనం చేశారు. వారు ఒకటి రెండు పర్యాయాలు గుట్టుగా ఇక్కడి నుంచి సరుకును అక్కడి నుంచి తరలించారు. గురువారం కూడా అలానే సరుకు తరలిస్తుండగా, కొంతమంది రైతులు గొడౌన్ వద్ద అడ్డుకున్నారు. తమకు డబ్బులు చెల్లించకుండా సరుకు ఎలా తీసుకెళతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడౌన్ వద్ద ప్రైవేటు బ్యాంక్ వారికి అడ్డుతగిలారు. వారి మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. సమాచారం అందుకున్న సీఐ ఎం శేషగిరిరావు, ఘటనా స్థలం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం నాగేశ్వరరావు కోనంకి గ్రామంలో లేకపోవడంతో, శుక్రవారం నాగేశ్వరరావును పిలిపిస్తామని చెప్పి పంపించారు. అప్పటివరకు సంయమనం పాటించాలని, తర్వాత అందరి సమక్షంలో మాట్లాడతానని రైతులకు సీఐ చెప్పడంతో రైతులు నాగేశ్వరరావు రాకకోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది.

సేవలు తూతూమంత్రం

(4వపేజీ తరువాయి)

కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు జీజీహెచ్‌కి చేసిన నిర్లక్ష్యపు రోగానికి తగిన మందు వేసి, పేదల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

మేం ఇంజక్షన్ చేయం..

ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు జబ్బు నయం కావాలంటే డాక్టర్ అందించే వైద్యం కన్నా, రోగులపట్ల నర్సులు చూపే శ్రద్ధకే సగం రోగం నయం అవుతుంది. ముఖ్యంగా వేళకు మందులు, డాక్టర్ నిర్దేశించిన ప్రకారం సమయానికి ఇంజక్షన్ చేయాల్సిన బాధ్యత నర్సులపై ఉంది. కానీ జీజీహెచ్‌లో వింత వైఖరి కనిపిస్తోంది. రోగంతో వచ్చిన బాధితులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడంతోపాటు, సూది కూడా డాక్టర్ వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే 400 మంది డాక్టర్లు వివిధ రోగాలకు సేవలందిస్తుండగా, సుమారు 900 మంది వరకు మేల్, ఫిమేల్ నర్సులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. టెక్నీషియన్‌లు, కాంపౌండర్లు ఇతర విభాగాల సిబ్బంది పనిచేస్తున్నా, వారివారి విధుల్లో వారు తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. కానీ ఇక్కడ డాక్టర్లే రోగం చూడాలి. వారే వైద్యం చేయాలి. వారే ఇంజక్షన్ చేయడం గమనార్హం. కానీ ఆ విధులు నిర్వర్తించాల్సి నర్సులు మాత్రం వచ్చామా.. పోయామా అన్నట్లు వ్యవహరించడంతో పేదలకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో లభించడం లేదు. ఇదే విషయమై ఆసుపత్రిలో చేరిన పలువురు బాధితులు నర్సులను ఇంజక్షన్ చేమని కోరితే ఆ డ్యూటీ మాది కాదు.. రోగి వివరాలు రాసుకోవడం (కేస్ షీట్) మాత్రమే మా పని అంటూ ముఖానే చెప్పడంతో రోగులు చేసేదేమి లేక డాక్టర్లను బతిమలాడుకోవాల్సి వస్తోంది.

అత్యవసర విభాగంలో ఆలకించే వారు కరువు

ఇక అత్యవసర విభాగం (క్యాజువాలిటీ) పరిస్థితి మరింత దారుణం, అత్యవసర విభాగంలో అప్రమత్తంగా ఉండాల్సిన నర్సులు, ఇతర సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా, ఇక పీజీ, ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులే రోగులకు అత్యవసర సంజీవనిగా మారుతున్నారు. అత్యవసర కేసులు అయిన గుండె, రోడ్డు ప్రమాదం, అగ్ని ప్రమాదం, ఇతర యాక్సిడెంట్‌లు, ఊపిరితిత్తులు, మొదడు, పక్షవాతం, ఇలా పలు అత్యవసర వైద్య సేవలకు సంబంధించి రోగి ఆసుపత్రికి రాగానే పరీక్షించి సంబంధిత డాక్టర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంది. వారు వచ్చి తగిన పరీక్షలు చేసి, వైద్యం అందించి, రోగి ప్రాణాలు కాపాడాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. వాస్తవానికి ఒక రోగిని అరగంటలో పరీక్షించి అవసరమైన అత్యవసర వైద్య సహాయం చేయాల్సి ఉండగా, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగిని బెడ్‌పై ఉంచి నాలుగు గంటలైనా పట్టించుకునే నాధుడు కరువయ్యారు. ఇప్పటికైనా ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై కలెక్టర్, ప్రజా ప్రతినిధులతో పాటు, అధికారులు కూడా దృష్టిసారించాలని బాధితులు కోరుతున్నారు.

ఖతార్ తెలుగు సంఘం ఎన్నికలలో ప్రకాశం వాసి విజయం

అవీఇవీ

తన ప్యానల్‌లోని పది మందిని గెలిపించి సత్తాచాటిన గొట్టిపాటి రమణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతార్‌లోని ఆంధ్ర కళా వేదిక అనే తెలుగు ప్రవాసీ సంఘానికి ఉత్కంఠభరితంగా జరిగిన ఎన్నికలలో ప్రకాశం జిల్లా మారుమూల గ్రామానికి చెందిన ప్రవాసీ గొట్టిపాటి రమణ విజయం సాధించారు. భారతీయ ఎంబసీ అధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వీటి ఫలితాలను బుధవారం రాత్రి ప్రకటించారు. తాను విజయం సాధించడమే కాకుండా తన ప్యానల్ నుంచి పోటీ చేసిన మరో పది మందిని కూడా గెలిపించిన రమణ ఖతార్‌లోని తెలుగు ప్రవాసీ సమాజంలో తన సత్తాను చాటారు. జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ ఖతార్‌లో ప్రముఖ ఇంజినీర్, జిల్లాకు చెందిన అనేక మంది యువకులకు ఖతార్‌లో ఉపాధి కల్పించిన ఆయనకు అందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. టీడీపీ ఖతార్ శాఖ అధ్యక్షుడు కూడా అయిన రమణ అక్కడి భారతీయ సామాజిక సేవకులలో ఒకరు.


విజయోత్సవ సభలో విక్టరీ సింబల్ చూపుతున్న రమణ

బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలి

పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంక్‌లు

సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఒంగోలు నగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ సమావేశం హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణనే ప్రధాన లక్ష్యంగా వసతి గృహాల సంక్షమ అధికారులు పనిచేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు తాగునీరుగా అందించాలని చెప్పారు. హాస్టళ్లను, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మెనూను కచ్చితంగా అందించాలని కోరారు. ఇక నుంచి పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంకులు కేటాయిస్తామన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖరరాజు, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల కార్యదర్శి మాధవీలత, నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటలక్ష్మి, ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి నిర్మల జ్యోతి, నెల్లూరు, జిల్లాల్లోని వసతి గృహాల సంక్షేమశాఖాధికారులు పాల్గొన్నారు.

పాకల తీరానికి అభివృద్ధి హారం!

(4వపేజీ తరువాయి)

ఎక్కడా లేనివిధంగా ప్రథమంగా పాకలలో రూ.15 లక్షలతో బేవాచ్ టవర్ నిర్మాణాన్ని పూర్తిచేయించారు. దీనిలో అత్యాధునికమైన సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, టైం క్లాక్ అనౌన్స్ సిస్టం ఏర్పాటు చేశారు. ఈ టవర్ నుంచి మెరైన్ భద్రతా సిబ్బంది తీరంలో పర్యాటకుల కదలికలను గమనించి అప్రమత్తం చేస్తారు.

ఊళ్లపాలెం తీరంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

ఊళ్లపాలెం తీరం వద్ద రూ.40 లక్షలతో రోడ్లు, రిటైనింగ్ వాల్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేశారు. పార్కు నిర్మాణానికి అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. సెంట్రల్ లైటింగ్ తీరానికి చేరుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని వేటకు వెళ్లే మత్స్యకారులు అంటున్నారు. రాత్రి సమయాల్లో సరుకు ఎగుమతి చేసుకోడానికి కూడా ఉపయోగపడుతుందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛమిత్రతో నగర పారిశుధ్యం మెరుగు

కమిషనర్ వెంకటేశ్వరరావు



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణ కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న స్వచ్ఛమిత్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీసీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పారిశుధ్య విభాగం సిబ్బంది, శానిటరీ సెక్రటరీలకు స్వచ్ఛమిత్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడిచెత్త సేకరణలో భాగంగా పొడి చెత్తను సంపద కింద మార్చే ప్రక్రియను స్వచ్ఛమిత్ర ద్వారా చేపట్టనున్నట్లు చెప్పారు. అందుకోసం ఐటీసీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని వివరించారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద నిర్వహించే ఈ కార్యక్రమం పైలట్ ప్రాజెక్టుగా ఒంగోలు కార్పొరేషన్‌ను ఎంచుకున్నారన్నారు. తద్వారా పొడి చెత్తను ప్రత్యేక వైన మిషన్‌లో శుభ్రపరిచి, పలు కంపెనీలకు సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. అందుకోసం ఐటీసీ కంపెనీ ప్రతినిధులు ప్రతి ఐదు డివిజన్‌లకు ఒకరు ఉంటారని, వారు కార్పొరేషన్ శానిటరీ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేస్తారని తెలిపారు. నగర సుందరీకరణ కోసం చేపడుతున్న బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ కోరారు. మూడు సంవత్సరాలపాటు స్వచ్ఛమిత్ర, కార్పొరేషన్‌తో కలిసి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమాకాంత్, ప్రతినిధి సుధ, సోషల్ యాక్టివిటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సునీల్, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, ఎన్.పిచ్చయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

కర్నూలులో జిల్లా నేతల సందడి

(4వపేజీ తరువాయి)

ప్రమాదం కారణంగా ఆ మార్గంలో వాహనాలకు ఆటంకం కలగడంతో పోరుమమిళ్ల వైపు మళ్లించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కర్నూలు సభలో రాష్ట్రంలో సుమారు రూ.13,400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ప్రధానమంత్రి మోదీ నిర్వహించారు. అందులో జిల్లాలోని కనిగిరి బైపాస్ రోడ్డు ఉంది. ఎన్‌హెచ్ 565 రోడ్డులో భాగంగా దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా కనిగిరిలో టీడీపీ శ్రేణులు ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి పర్యటనలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. సీఎం కార్యాలయ ఆదేశాల ప్రకారం కర్నూలులో ప్రధాన మంత్రికి స్వాగతం పలికేందుకు బుధవారం రాత్రి మంత్రి స్వామి కర్నూలు చేరారు. శ్రీశైలంలో స్వాగతం పలికేందుకు వెళ్లాలని అప్పుడు సమాచారం రావడంతో తెల్లవారుజామును శ్రీశైలం చేరుకొని ఉదయాన్నే పీఎం దిగే హెలిప్యాడ్ వద్దకు స్వామి వెళ్ళగా అక్కడి వీఐపీ జాబితాలో ఆయన పేరు లేదు. తిరిగి కర్నూలు జాబితాలోనే ఉంచినట్లు గుర్తించారు. దీంతో మళ్లీ కర్నూలు వెళ్ళడం ఆలస్యం అవుతున్న కారణంగా మంత్రి స్వామి శ్రీశైలం నుంచి వెనుతిరిగారు.

పంచాయతీ స్థలాల ఆక్రమణపై దృష్టి

(4వపేజీ తరువాయి)

ఉండగా ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాలతో పూర్తిస్థాయిలో ఆ పంచాయతీలకు సంబంధించి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. పూర్తిస్థాయిలో సమాచారం సేకరించిన అనంతరం ఆ భూములను స్వాధీనం చేసుకునే విధంగా అడుగులు వేస్తున్నారు.

అన్ని శాఖల సహకారంతో..

ఆక్రమణదారుల నుంచి ఆ స్థలాలు, భూములను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైతే రెవెన్యూ, పోలీసుల సహకారాన్ని కూడా తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతోపాటు ఆయా పంచాయతీలకు స్థానికంగా వనరులను సమీకరించే విధంగా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం పంచాయతీలకు సంబంధించిన విలువైన భూములు, స్థలాలన్నింటిని గుర్తించి స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

స్థలాలన్నింటిని గుర్తించే విధంగా చర్యలు చేపట్టాం

జిల్లాలో పంచాయతీలకు సంబంధించి విలువైన స్థలాలన్నింటిని గుర్తించే విధంగా చర్యలు చేపట్టాం. అందుకు సంబంధించి ప్రొఫార్మాను తయారు చేసి ఆయా గ్రామ పంచాయతీలకు ఇస్తున్నాం. ప్రస్తుతం పంచాయతీ అధీనంలో ఎన్ని స్థలాలు ఉన్నాయనే వివరాలతోపాటు ఇక్రమణదారుల చేతుల్లో ఎంత ఉందనే వివరాలు కూడా సేకరించి కలెక్టర్‌కు నివేదిస్తాం. తదుపరి కలెక్టర్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాము.

-- ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

(4వపేజీ తరువాయి)

భాగంగానే గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే గురుకులాలు, వసతిగృహాల్లో మరమ్మతుల కోసం రూ.143 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విద్యార్థులతో కొద్దిసేపు ముఖాముఖీ నిర్వహించిన ఆయన వారికి పలు సూచనలు చేశారు.విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని వారితో మాట్లాడారు.

పాఠశాలను పరిశీలించిన మంత్రి స్వామి

మంత్రి స్వామి ఆకస్మిక రాకతో ఒక్కసారిగా పాఠశాల సిబ్బంది ఆశ్చర్యపోయారు. తనతోపాటు నాయకులు ఎవరూ రావద్దని, మీడియాను కూడా రావద్దని తరువాత మాట్లాడతానని చెప్పి పాఠశాలలోని ప్రతి అంశాన్ని మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులు, వంట, మరుగుదొడ్లు, పారిశుధ్య పరిస్థితి చూసి కొన్ని సమస్యలపై సిబ్బందిని సున్నితంగా మందలించినట్లు తెలిసింది. తరువాత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి నుంచి కొన్ని విషయాలు రాబట్టి పాఠశాల సిబ్బందిని హెచ్చరిస్తూ విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితుల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఆయనతోపాటు మండల టీడీపీ కన్వీనర్ మేకల వలరాజుయాదవ్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని చలమయ్య, మండల నాయకులు ఎం. శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ ఉన్నారు.

నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)


ప్రధాని సభకు ముస్లిం మహిళలు


సభకు వేలాది బస్సులు ఇలా...


మోదీతో చంద్రబాబు, పవన్






సభలో ఉప్పొంగిన దేశభక్తి


సభలో టీడీపీ మహిళా నేతలు






శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ


పొలాల వెంబడి పరుగులు

నకిలీ మద్యం.. ఇట్టే తెలుసుకోవచ్చు..!



సురక్షా యాప్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వం

మందుసీసాపై లోగోను స్కాన్ చేస్తే సెల్‌ఫోన్‌లో వివరాలన్నీ ప్రత్యక్షం

నకిలీ మద్యం మూలాలను ఎక్కడున్నా పెకిలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఆరోగ్యకరమైన మద్యం మాత్రమే దొరికిలే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఏపీ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా యాప్‌ను ఆవిష్కరించింది. మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే ఆ కంపెనీ, తయారీ తేదీ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి.

యాప్‌ను ఇలా వినియోగించాలి..



- మొదట సెల్ ఫోన్‌లో ఏపీ ఎక్సైజ్ శాఖ ఆవిష్కరించిన సురక్షా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్టికర్‌ను యాప్‌తో స్కాన్ చేయాలి.
- మద్యం బాటిల్ ఏ కంపెనీది, ఎప్పుడు తయారైంది వంటి వివరాలన్నీ సెల్‌లో కనిపిస్తాయి.
- ఒకవేళ మద్యం బాటిల్ అనుమానాస్పదంగా ఉంటే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- బీరు బాటిళ్లను స్కాన్ చేసే అవకాశం లేదు.

మద్యం విక్రయాలలో పారదర్శకత


ఈఎస్ అయేషాబేగం

సురక్ష యాప్ ద్వారా ప్రభుత్వం మద్యం విక్రయాలలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు దోహదపడుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్ అయేషాబేగం చెప్పారు. ఒంగోలు ప్రకాశం భవన్‌లో గురువారం సాయత్రం జరిగిన మీడియా సమావేశంలో సురక్షా యాప్ వివరాలను ఆమె తెలియజేశారు. నకిలీ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకొని వినియోగించాలని కోరారు. ఇప్పటికే నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాణ్యమైన మద్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొదించిందన్నారు. అంతే కాకుండా ప్రజల ఆరోగ్య రక్షణకు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను డౌన్‌లోడు చేసుకొని చట్టవిరుద్ధ మద్యం విక్రయాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

-ఒంగోలు క్రైం, (ఆంధ్రజ్యోతి)

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

నేడు టేబుల్ టెన్నిస్ ఎంపికలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికల జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు జరుగుతాయని జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చెక్కా వెంకటేశ్వర్లు, ఏ శిరీషకుమారిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98485754494 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- రైల్వే వంతెనను ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి.. స్తంభించిన ట్రాఫిక్
- ప్రధాని కర్నూలు పర్యటనతో అప్రమత్తమైన అధికారులు


ఘాట్ రోడ్డులో గోడను ఢీకొన్న లారీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలోని బొగదా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ రోడ్డు ప్రమాదంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున కర్నూలు నుంచి విజయవాడకు ఆల్కలిస్ ఫ్యాక్టరీ నుంచి కెమికల్ లోడుతో లారీ విజయవాడకు వెళుతున్నది. మార్గ మధ్యంలో బొగదా సమీపంలో పాత రైల్వేవంతెన వద్ద గల మూలమలుపులో లారీ గోడను ఢీకొట్టడంతో డ్రైవర్ ఏకోబ్‌రాజు (51) అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ రోడ్డుకు అడ్డంగా నిలబడడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు అటూ ఇటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తెల్లవారేసరికి ఇరువైపులా 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులకు ఒకసారి ఏదో ఒక ప్రమాదం జరిగి ట్రాఫిక్ స్తంభిస్తున్నది. సమాచారం అందుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ సిబ్బందితో కలిసి ఆప్రాంతానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా నిలబడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతిచెందిన డ్రైవర్ ఏకోబ్‌రాజు మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనితో ఉదయం 10గంటల సమయానికి ట్రాఫిక్ సమస్య క్లియర్ అయ్యింది.

ప్రధాని కర్నూలు పర్యటనతో అధికారుల అప్రమత్తం

ఇలా ఉండగా ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన సందర్భంగా ప్రకాశం జిల్లా నుంచి కర్నూలులో జరిగే బహిరంగ సభకు వెళ్లే వాహనాలు, ప్రజాప్రతినిధులు వెళుతుండడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. నల్లమల అటవీ ప్రాంతంలో బొగదా వద్ద జరిగిన లారీ ప్రమాదం విషయం తెలుసుకుని అధికారులు హుటాహుటిన ఆప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని అధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు ఆప్రాంతానికి చేరుకుని క్లియర్ చేశారు. జిల్లా నుంచి వెళ్ళే వాహనాలు గిద్దలూరులోని సీతారామ కల్యాణ మండపంలో స్థానిక అధికారులు టిఫిన్, భోజన ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు జరుగుకుండా చేశారు.10 గంటల నుంచి బహిరంగ సభకు వెళ్ళే వాహనాలు నల్లమల ఘాట్ రోడ్డు గుండా వెళ్లాయి. ఘాట్ రోడ్డులో కూడా పోలీసులు ట్రాఫిక్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కొండముచ్చును వేటాడిన కేసులో ఒకరి అరెస్టు

తప్పుడు కేసులు బనాయించారంటూ నిందితుడి బంధువుల ఆందోళన


కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న తిమ్మయ్య బంధువులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండముచ్చును వేటాడి చంపి మాంసాన్ని విక్రయించిన కేసులో అటవీశాఖ అధికారులు ఒకరిని అదుపులోకి తీసుకన్నారు. అయితే తమ బంధువుపై తప్పుడు కేసులు బనాయించి అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారంటూ నిందితుడి బంధువులు అటవీశాఖ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అందిన సమాచారం మేరకు బేస్తవారపేట రేంజ్ పరిధిలోని పొగుళ్ళ గ్రామంలో గత నెల 26వ తేదీన కొండముచ్చును నాటు తుపాకీతో కాల్చిచంపి మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారంతో అటవీశాఖ యాంటీ పోచింగ్ రేంజ్ అధికారి టి.సత్యనారాయణ సిబ్బందితో పొగుళ్ల గ్రామానికి వెళ్లి విచారించారు. కొండముచ్చు మాంసంను తొలుత కొనుగోలు చేసి ఉన్న రామేశ్వరం గ్రామానికి చెందిన కోసంగి పోలయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆ తరువాత విచారణలో భాగంగా తనకు పొగుళ్ల గ్రామానికి చెందిన మేకల తిమ్మయ్య కొండముచ్చు మాంసాన్ని విక్రయించినట్లు తెలిపాడు. దీంతో అటవీశాఖ అధికారులు తిమ్మయ్యను బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. అనంతరం విచారించగా తిమ్మయ్య నాటు తుపాకీతో కొండముచ్చును చంపినట్లు తెలిపినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. నాటు తుపాకీని దాచి ఉంచిన ప్రదేశాన్ని తిమ్మయ్య చూపడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఇదిలావుండగా మేకల తిమ్మయ్య బంధువులు గురువారం అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నాకు దిగి అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిమ్మయ్య అనే వ్యక్తి వద్ద అటవీశాఖ అధికారులే నాటుతుపాకీ ఉంచి అక్రమంగా అరెస్టు చేశారని వారు ఆందోళనకు దిగారు. అరెస్టు చేసిన తిమ్మయ్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ప్రకాశం రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దివ్య క్షేత్రాలైన అరుణాచలం, శ్రీకాళహస్తి, శైవ క్షేత్రాలను ప్రతి సోమవారం దర్శించుకునేందుకు ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, పొదిలి, కనిగిరి నుంచి ప్రతి శనివారం ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్‌లు కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీన, నవంబరు 1, 8, 15వ తేదీలలో రాత్రి బస్సులు బయలుదేరి, ఆదివారం తిరుత్తణి, శివకంచి, విష్ణుకంచి దర్శించుకుని, సాయంత్రానికి తిరువణ్ణామలై(అరుణాచలం) చేరుకుంటుందని, అదే రోజు రాత్రి గిరి ప్రదక్షిణ చేసుకుని సోమవారం ఉదయం అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం కాణిపాకం, కాళహస్తి పుణ్య క్షేత్రాలను దర్శించుకుని మంగళవారం ఉదయానికి తిరిగి వస్తుందని తెలిపారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి 3వ తేది కూడా అరుణాచలం వరకు ప్రత్యేక బస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఆయా డిపోల మేనేజర్‌ను సంప్రదించవచ్చని ఆర్‌ఎం తెలిపారు.

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం అభివృద్ధి

రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో కలెక్టర్ రాజాబాబు


సెల్ఫీ పాయింట్‌లో పిల్లలతో కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం తద్వారా గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశ్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు వంటి కార్యక్రమాలను చేపడుతున్నాయని కలెక్టర్ పీ రాజాబాబు చెప్పారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామ స్థాయి నుంచి అంగన్‌వాడీ వ్యవస్థను తీసుకొచ్చాయన్నారు. దేశ సంపద, అభివృద్ధి ఆ దేశంలోని మానవాళి అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు పిల్లలు ఉంటే వారు అనారోగ్యంతో ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్‌లో పిల్లలతో కలిసి కలెక్టర్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, మెప్మా పీడీ శ్రీహరి, డాక్టర్ భగీరధి, విజయం చారిటబుల్ ఫౌండేషన్ న్యూట్రిషన్ స్పెషలిస్టు డాక్టర్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో విశేష కృషి చేసిన తొమ్మిదిమంది సూపర్‌వైజర్లకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు అన్నప్రాసన, సామూహిక శ్రీమంతాలు చేశారు.

శ్రీశైలానికి వాహనాలు నిలిపివేత

పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో ఘాట్ రోడ్లలో ఆంక్షలు

అడుగడుగునా పోలీసుల నిఘా


దోర్నాలలో నిలిచిన వాహనాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గురువారం పీఎం పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు దోర్నాలలో వాహనాలను నిలిపివేశారు. నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరుకానున్న క్రమంలో ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసు శాఖా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ యూ నాగరాజు డివిజన్‌లోని పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రెండు ఘాట్ రోడ్లలో పది కిలోమీటర్లకు ఒక ఎస్సైతోపాటు 8మంది పోలీసుల చొప్పున పహారా ఏర్పాటు చేశారు. పైగా హెలీకాఫ్టర్ ద్వారా నల్లమలలో జల్లెడ పట్టారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీశైలానికి వాహనాలను అనుమతించలేదు. మూడురోజులుగా వివిధ రూపాల్లో ప్రకటనల నేపథ్యంలో యాత్రికులు కూడా పెద్దగా శ్రీశైలానికి రాలేదు. పది పన్నెండు వాహనాలు అవి కూడా ప్రభుత్వ ఆర్‌టీసీ బస్సులు, కొద్ది సంఖ్యల్లో కార్లు వెళ్తుండడంతో దోర్నాలలోనే నిలిపివేశారు. పీఎం పర్యటన అనంతరం యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి.

పేదరికాన్ని తగ్గించని పథకాలు

జిల్లాలో లక్షకు పైగా పేద కుటుంబాలు

ప్రజా ప్రభుత్వంలో పీ 4 అమలుతోనైనా గట్టెక్కేనా...

పేదల అభ్యున్నతికి ఆలస్యంగా పడుతున్న అడుగులు

నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం



ఒంగోలునగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుకాక సత్ఫలితాలు ఇవ్వటం లేదు. ఏటా ప్రభుత్వం సేకరిస్తున్న వివరాలను పరిశీలిస్తే జిల్లాలో పేదరికం తగ్గిన దాఖలాలు కనిపించటం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు.. నేటి ప్రస్తుత ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోంది. దీనికి తోడు రాష్ట్రంలో చాలా ఏళ్లగా పొదుపు ఉద్యమం బలోపేతమైంది. మహిళలు వేల కోట్ల రూపాయలు బ్యాంకుల నుంచి రుణాలుగా పొందుతూ తిరిగి చెల్లింపులు చేస్తున్నారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహించేందుకు పావలా వడ్డీకే రుణాలు అందజేస్తోంది. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా పీ4 విధానం ద్వారా పేదరికాన్ని తగ్గించాలనే ఆలోచన చేసింది. జిల్లాలో గత పదేళ్లుగా చూసుకుంటే పేదరికం ఎక్కడా తగ్గిన సూచనలు కనిపించటం లేదు. పీ 4 అమలులో భాగంగా ప్రభుత్వం ఇటీవల సేకరించిన లెక్కల ప్రకారమే జిల్లాలో లక్షకు పైగా కుటుంబాలు పేదరికంలో ఉన్నాయి. ఈసంఖ్య గతం కంటే ఎక్కువగానే కనిపిస్తోంది. ఈ కుటుంబాలన్నింటినీ పేదరికం నుంచి బయటపడేసే దిశగా ప్రస్తుత ప్రభుత్వం పీ4 పైనే ఆశలు పెట్టుకుంది.

● 6.61 లక్షల తెల్ల రేషన్ కార్డులు

పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ తెలుపు రంగు రేషన్ కార్డునే ప్రమాణికంగా తీసుకుంటోంది. జిల్లాలో మొత్తం 22 లక్షల మంది జనాభా ఉండగా రేషన్ కార్డులు 6.61 లక్షల తెలుపురంగు రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఏటా వేల కోట్ల రూపాయలు సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్నా పేదరికం నుంచి బయటపడుతున్న దాఖలాలు కనిపించటం లేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు అందాల్సిన తెలుపు రంగు రేషన్‌కార్డులు ధనవంతులు కూడా పొందుతూనే ఉన్నారు. దీన్ని అరికట్టటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫలితంగా పేదల కోసం ఖర్చు చేస్తున్న సొమ్ము ఎక్కువగా దుర్వినియోగం అవుతూనే పోతోంది.

● పరిశ్రమల రాయితీలు రావు

జిల్లాలో విశాలమైన సముద్రతీరం ఉంది. ఉద్యాన వన పంటలకు అనుకూలమైన వాతావరణం ఉంది. సాగుకు నీరందించే నదులు ఉన్నాయి. వెలిగొండ వంటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నాయి. తీరం వెంట మత్స్యరంగానికి సంబంధించిన అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ప్రయివేట్ రంగంలో కూడా వీటి జాడకనిపించటం లేదు. ప్రభుత్వం జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలు ఏర్పాటుకు చొరవ చూపటం లేదు. నిరుద్యోగులు ఏర్పాటు చేసుకుంటున్న చిన్నపరిశ్రమలకు కూడా ప్రభుత్వాలు రాయితీలను సకాలంలో విడుదల చేయటం లేదు. దీంతో ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక పరిశ్రమలు జిల్లాలో అనతి కాలంలోనే మూతపడిపోతున్నాయి.

● అర్హులకు అందితేనే...

ప్రభుత్వం పేదరిక నిర్ములన కోసం అమలు చేస్తున్న పథకాల్లో అక్రమాలే అధికంగా చోటు చేసుకుంటున్నాయి. అర్హుల దరి చేరటం లేదు. వాస్తవంగా పేదలకు అవసరమైన పథకాలు, వాటి ద్వారా వారు వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశాలు, ఇన్నేళ్లుగా ఇన్ని పథకాలు అ మలు చేస్తున్నా వాటి వలన ప్రయోజనం ఏ మాత్రం ఒనగూరిందనే సమీక్ష, అంతకన్నా మెరుగైన దిశగా వాటిని అమలు చేయటం ద్వారానే పేదరిక నిర్మూల జరుగుతుందని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చటం కోసం పరిశ్రమల స్థాపన ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం అతుందనే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

పొదుపు సంఘాల రుణాలు రూ.2 వేల కోట్లు

పేదరికంపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు వాస్తవాలకు పొంతన ఉండటం లేదు. జిల్లాలో 46వేల మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 4.60 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరు ఏటా రూ.2 వేల కోట్లు బ్యాంకుల నుంచి రుణాలుగా పొందుతున్నారు. కుటీర పరిశ్రమలు, పాడిపరిశ్రమ, పచ్చళ్ల తయారీ, దుస్తులు తయారు చేసే యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీరి ఉత్పత్తులు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. రుణాల నెలవారీ చెల్లింపులు కూడా 99.50 శాతంగా ఉంటున్నాయి. 25 ఏళ్ల క్రితం ప్రారంభించిన పొదుపు ఉద్యమం జిల్లాలో వటవృక్షంలా ఎదిగింది. కాని పేదరికం మాత్రం ఎక్కడా తగ్గినట్లు లెక్కలు తేలటం లేదు.

నా పొలాన్ని ఆక్రమించారు

తహసీల్దార్‌కు గిరిజన మహిళ ఫిర్యాదు


చంటిబిడ్డతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన శ్రీలక్ష్మీబాయి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమ పొలాన్ని గ్రామానికి చెందిన నెట్టూరి గురవయ్య అలియాస్ కరీమయ్య ఆక్రమించుకున్నాడని మండలంలోని జయరాంపురం తాండాకు చెందిన శ్రీలక్ష్మీబాయి అనే వివాహిత చంటి పిల్లాడితో కలిసి వచ్చి తహసీల్దార్ ఆంజనేయరెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 483, 484లలో ప్రభుత్వం మా జేజనాయన బుక్కె మంగేనాయక్‌కు 3.38 ఎకరాల పొలానికి డీకే పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన మృతి చెందిన తరువాత వివాహం కావడంతో తాము దిగువమెట్ట తాండాలో ఉన్నామని, ఇటీవల మా పొలాన్ని సాగు చేసుకునేందుకు వెళ్లగా గ్రామానికి చెందిన గురవయ్య ఆక్రమించుకుని సాగు చేస్తున్నాడని, మా పొలాన్ని మాకు ఇప్పించాలని గత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆమె వాపోయారు. తహసీల్దార్ ఆంజనేయరెడ్డి స్పందిస్తూ గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు గురవయ్యను పిలిపించి మాట్లాడగా శ్రీలక్ష్మీబాయి తల్లిదండ్రులు ఈపొలాన్ని తమకు అమ్మినట్లు చెప్పారని, ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ పొలాలను అమ్మినా, కొనుగోలు చేసినా నేరమేనని, ఈవిషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

నేడు జిల్లా స్థాయి హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 ఉమ్మడి జిల్లా స్థాయి బాల,బాలికల హాకీ జట్ల ఎంపికలు జరగనున్నట్లు జిల్లా కార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏ శిరీష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో ఎంపికలకు హాజరయ్యే వారు 1-1-2012 తర్వాత, అండర్- 17కు 1-1-2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్‌తో పాటు లీప్ యాప్‌లో నమోదు చేసుకుని ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు పీఈటీలు శ్రీనివాసరావు, రవికుమార్‌లతోపాటు 7989440879, 9951578357 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ప్రధానికి ఒడా చైర్మన్ స్వాగతం



ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న చైర్మన్ రియాజ్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ స్వాగతం పలికారు. గురువారం శ్రీశైలం హెలిప్యాడ్ ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చైర్మన్ రియాజ్ స్వాగతించారు. ప్రధానమంత్రి కూడా అందరికీ నమస్కరిస్తూ ముందుకు సాగారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రమాదేవి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కంకణాల రమాదేవి ఎన్నికయ్యారు. అనంతపురంలో మూడు రోజుల పాటు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకోగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శ్రీదేవి, వి.సావిత్రిలు ఎన్నిక కాగా జిల్లా నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రమాదేవిని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా జిల్లానుంచి సయ్యద్ షర్మిల ఎంపికయ్యారు. నూతన కమిటి సభ్యులను వివిధ సంఘాల నాయకులు అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

టంగుటూరు (కొండపి), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కారుమంచి గ్రామంలో జరిగింది. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన కథనం ప్రకారం.. కారుమంచి గ్రామానికి చెందిన దామవరపు అరవింద్ చీరాలకు చెందిన వహీద (26) ప్రేమించుకుని పెద్దల సమ్మతితో 2019లో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి వారు కారుమంచిలో నివాసం ఉంటున్నారు. వహీదాకు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈక్రమంలో గురువారం విపరీతంగా వహీదాకు కడుపునొప్పి రావడంతో భరించలేక బుధవారం ఉదయం ఇంటిలో ఉన్న ఎలుకల మందు తిన్నది. ఆమెను భర్త ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆమె మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు

- సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆ పార్టీ నాయకులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ.హుస్సేన్ తదితర నాయకులు నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర కాలేజీ వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్టీ బాలుర వసతి గృహం ఆవరణ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వసతిగృహాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల సాంఘికసంక్షేమశాఖ మంత్రి వసతిగృహాలను సందర్శించి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు చెకుముకి పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 18వతేదీన చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెకుముకి సైన్స్ సంబరాలు నాలుగు స్థాయిల్లో జరుగుతాయన్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. 18న పాఠశాల స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు సైన్స్ పరీక్ష, నవంబరు 1న మండల, పట్టణ స్థాయిలో పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

సురక్ష యాప్ ద్వారానే మద్యం విక్రయాలు



విక్రయాలను పరిశీలిస్తున్న సీఐ సుకన్య

చీమకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో సురక్ష యాప్ ద్వారానే విక్రయాలు జరపాలని ఎక్సైజ్ సీఐ సుకన్య తెలిపారు. చీమకుర్తి ఎక్సైజ్ కార్యాలయ పరిధి లోని 18 మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలను గురువారం ఆమె పరిశీలించారు. కల్తీ మద్యానికి అడ్డుకట్ట వేసేక్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్ష యాప్‌పై దుకాణదారులకు అవగాహన కల్పించారు. విక్రయాల తీరును పరిశీలించారు. యాప్ ద్వారా విక్రయాలు జరపకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమలో ఎస్ఐ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

- ట్రాఫిక్ సీఐ పాండురంగారావు
- 35 మందికి రూ.10వేల చొప్పున కోర్టు జరిమానా

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మద్యం తాగి వాహనాల నడిపితే చర్యలు తప్పవని ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు హెచ్చరించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు బ్రీతింగ్ ఎన్‌లైజర్‌తో పరీక్షలు చేసి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 35మందిని అదుపులోకి తీసుకొని గురువారం రెండో అదనపు మునిసిఫ్ మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరిచినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కోకరికి రూ.10వేల చొప్పున 35 మందికి మొత్తం రూ.3,50,000లు కోర్టు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో విద్యుత్‌లైన్ల మరమ్మతుల వల్ల శుక్రవారం పలుచోట్ల కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కర్నూల్‌రోడ్డు, పీర్లమాన్యం, అరుణోదయకాలనీ, గణపతినగర్, శ్రీకృష్ణనగర్, విరాట్‌నగర్, ఆంధ్రకేసరినగర్, పాలకేంద్రం, టీచర్స్‌కాలనీ, సమతానగర్, రాజుల కాలనీలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, అలాగే ఎన్‌జీవోకాలనీ, సరస్వతి శిశుమందిరం, చంద్రయ్యనగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రకటన

ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ ఇలాకా, ఒంగోలు కార్పోరేషన్ పరిధిలోని పేర్నమిట్ట గ్రామ సర్వేనెం.183/5 హక్కుదారుడైన పేర్నమిట్ట వాస్తవ్యులు మాదాసు వెంకటేశ్వర్లు S/o. కోటయ్య అనువారు గోళ్ళ ఆంజనేయులు S/o. నరశింహం రామన్నపేట, ఒంగోలు వారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వగా మీరు 18-03-1998న గోళ్ళ అంజనేయులు GPA ద్వారా కదం వెంకటేశ్వర్లు S/o. సుబ్బయ్య దొనకొండ (V&M) అనువారు పై తెలిపిన 183/5 సర్వే నెంబరులోని 58,59 నెంబర్ గల ప్లాట్లను కొని రిజిస్ట్రేషన్ చేయించుకొనడమైనది.

ఈ కదం వెంకటేశ్వర్లు మాకు 58 ప్లాటు నెంబరును సానికొమ్ము హనుమారెడ్డి పెదగొల్లపల్లి(V), హనుమంతునిపాడు(M), మరియు తన్నీరు శ్రీనివాస్, సంతనూతలపాడు(V&M) ప్లాటు నెంబరు - 59 మాకు అమ్మజూపగా మేము ఇరువురము పైన తెలిపిన ప్లాటు నెం 58,59 లను కొనుటకు సిద్ధమైనాము. ఇవి దిగువ తెలిపిన సరిహద్దులలో లోబడి ఉన్నవి. వీటి విస్తీర్ణం ఒక్కొక్క ప్లాటు 30 గదులు మొత్తం - 30+30 = 60 గదులు.

సర్వే నెం.183/5 షెడ్యూలు

తూర్పు: కసుమళ్ళ వెంకటేశ్వర్లు & ఉప్పలపాటి గీతాంజలి ప్లాటు నెం-41, **పడమర :** 20 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** మాచవరపు చెంచమ్మ ప్లాట్ నెం.60, **దక్షిణం:** 20 అడుగుల రోడ్డు.

ఇవి కొనుటకు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నా ఏ విధమైన సివిల్ క్రిమినల్ కేసులు ఉన్నా 15 రోజుల లోపల తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. తదుపరి ఎవరైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నా చెల్లబడవు.

ఇట్లు : మైలా సింగయ్య, అడ్వకేట్
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు
సెల్: 9989104213



సుందరయ్యభవన్ రోడ్డులో సైడు కాలువ మూసేసి నిర్మించిన ర్యాంప్‌లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

మురుగు కాలువలు..
మూసుకుపోతున్నాయి..!

- చినుకు పడితే రోడ్లు చెరువులే..
- ఆక్రమణలో ప్రధాన డ్రైనేజీలు
- కాలువలు మూసేసి, దుకాణాలను నిర్మించిన వైనం
- పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధులు పెరిగాయి. జనాభా పెరిగింది. వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కార్పొరేషన్ హోదా కల్పించింది. కానీ అందుకు అనుగుణంగా నగరంలో డ్రైనేజీ సౌకర్యం మెరుగుపడలేదు. ఒంగోలు మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇరుకైన కాలువలు, కాలువలపై ఆక్రమణలు తప్ప మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగుపడటం లేదు. దీంతో ఎప్పటికప్పుడు తాత్కాలిక పనులకే పరిమితమైపోయాయి. ప్రతి ఏడాది ఓపెన్ డ్రైనేజీల నిర్మాణ కోసం రూ.50-60 లక్షల వరకు ఖర్చు చేస్తున్న అధికారులు శాశ్వత పరిష్కార దిశగా ప్రతిపాదనలు చేపట్టడంలో విఫలమౌతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన వైసీపీ ప్రభుత్వం హయాంలో కనీస ప్రగతి వైపు కన్నెత్తి చూడకపోగా, కొద్దిపాటి వాన కురిసినా నగరం చెరువులా మారిపోతుంది. వర్షాకాలం కావడంతో మురుగునీటి సమస్యను అధిగమించేందుకు అధికారుల ముందస్తు చర్యలు చేపడుతున్నా, పెద్దగా ప్రయోజనం కనిపించని పరిస్థితి నెలకొంది. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతంలో కాలువ పూడికతీత పనులతో కాలం గడిపేస్తున్న యంత్రాంగం శాశ్వత పరిష్కారం కోసం అంతర్గత డ్రైనేజీ విధానం ఏర్పాటు కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారే తప్ప సమస్య తీరే వైపుగా దృష్టి సారించడం లేదు. గత వైసీపీ పాలనలో నగర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కోసం ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. నేటికి డ్రైనేజీ వ్యవస్థపై పెద్దగా పట్టించుకున్న నాధుడు లేడు. జిల్లా కేంద్రం.. అందులోనూ అధికార యంత్రాంగమంతా ఇక్కడే ఉంటారు. కానీ కొద్దిపాటి వర్షం కురిసినా నగరమంతా నీట మునిగిపోతున్నా తాత్కాలిక చర్యలకే పరిమితమౌతున్నారు. ఇప్పటికైనా నగరంలోని డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించి, వరద ముంపు కష్టాల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. - ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)



60అడుగులరోడ్డులో సైడు కాలువపై నిర్మించిన మెట్లు



దిబ్బలరోడ్‌లో ఇలా..



అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో..



సుందరయ్యభవన్ రోడ్డులో కనిపించని డ్రైనేజీ కాలువ

ఘనంగా సేవా కార్యక్రమాలు

- శిద్దా సుధీర్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలు రంగాలకు చెందిన ప్రముఖులు
- భారీగా తరలివచ్చిన అభిమానులు

ఒంగోలు/చీమకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువ పారి శ్రామికవేత్త, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శిద్దా సుధీర్‌కుమార్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఒంగోలులోని శిద్దా నివాసంతో పాటు చీమకుర్తిలోని శిద్దా కుటుంబానికి చెందిన హరిహరక్షేత్రం వద్ద, అలాగే గ్రోత్‌సెంటర్‌లోని జ్యోతి గ్రానైట్ కంపెనీ వద్ద అభిమానులు, శిద్దా గ్రూపు సంస్థల ఉద్యోగులు నిర్వహించిన వేడుకల్లో సుధీర్‌కుమార్ హాజరయ్యారు. తొలుత స్థానిక లాయర్‌పేటలోని నివాసంలో తన తండ్రి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల నుంచి ఆశీర్వచనం పొంది కుటుంబసభ్యులతో కలిసి పుట్టినరోజు కేక్‌ను కట్‌చేశారు. అభిమానులు గజమాలతో ఆయనను సత్కరించారు. అనంతరం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో సుధీర్‌కుమార్, శృతి, కుటుంబసభ్యులు అభిమానుల సమక్షంలో గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరి, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్‌కిట్, యూనిఫాం, పాటిమీదపాలెం పాఠశాలకు ఇంటర్నెట్ సదుపాయం, ఎండీఎంకు గ్యాస్ ఖర్చు, బండ్లమూడి పాఠశాల విద్యార్థులకు ఆటవస్తువులు, ఎస్కేఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు అల్పాహారం సౌకర్యాలను అందజేశారు. కార్యక్రమంలో గిరి, కాట్రగడ్డ రమణయ్య, గ్రానైట్ వ్యాపారులు ప్రవీణ్‌కృష్ణ, కోడూరి వెంకట్రావు, మలినేని వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి కిరణ్, నూకల సురేంద్ర, శ్రీహరి, హనుమంతరావు, వెంకట్రావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్నం గ్రోత్‌సెంటర్‌లోని జ్యోతిగ్రానైట్‌లో ఉద్యోగుల ఆధ్వర్యంలో సుధీర్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించగా 100మంది రక్తదానం చేశారు. కాగా ఒంగోలులోని శిద్దా నివాసంలో జరిగిన వేడుకల్లో జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘాలు, గ్రానైట్‌తో పాటు ఇతర పలు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన ప్రముఖులు, అలాగే ఒంగోలు, దర్శి మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాలకు చెందిన అభిమానులు అధిక సంఖ్యలో వచ్చి సుధీర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



సుధీర్‌కుమార్ కుటుంబసభ్యులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



చీమకుర్తిలో విద్యార్థులకు క్రీడాదుస్తులను అందజేస్తున్న సుధీర్‌కుమార్

ముప్పా సురేష్ బెయిల్‌పై విడుదల

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితుడు ముప్పా సురేష్‌కు బెయిల్ మంజూరు కాగా గురువారం ఒంగోలులోని జిల్లా జైలులో ఉన్న ఆయన విడుదల అయ్యారు. అయితే ప్రతి ఆదివారం ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని నిబంధన విధించారు. ఆగస్టు 18న అరెస్టు అయిన సురేష్ 59 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



తల్లులకు అవగాహన కలిగిస్తున్న అంగన్‌వాడీలు

కొండపి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. పోషణమాసోత్సవాల్లో భాగంగా గురువారం కొండపి పంచాయతీలోని దాసరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భవతులకు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. పోషకాహారాన్ని ఇచ్చే చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరిత, ఆదిలక్ష్మి, ప్రమీల, మస్తానమ్మ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో కొనుగోలుదారులకు ఆదా

- ఎంవీఐ జగదీష్



రవాణాశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొండపి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తో వాహన కొనుగోలుదారులకు భారీగా నగదు ఆదా అవుతున్నదని, ప్రధానంగా రవాణా, లాజిస్టిక్స్ రంగంలో వారు ఎంతో లాభపడతారని ఒంగోలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని కొండపిలో గురువారం అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యాలయాల నుంచి బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ సరుకు రవాణా, బస్సులు, మినీబస్సులు వాహనాలపై 10శాతం జీఎస్టీ తగ్గిందన్నారు. రైతులు కొనుగోలు చేసే ట్రాక్టర్లపై 7శాతం జీఎస్టీ తగ్గిందన్నారు. సరుకు రవాణా వాహనాలపై థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 7శాతం తగ్గిందని ఆయన అన్నారు. వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ రాయితీని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.సుగుణ మాట్లాడుతూ సరుకులపై జీఎస్టీ భారీగా తగ్గిందని ప్రజలపై భారం తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ భానుప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, కొండపి ఉపసర్పంచ్ కూనంనేని వాసంతి, కొండపి గ్రామ పంచాయతీ కార్యదర్శి వున్నం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులకు సంజీవని 'సీపీఆర్'

డాక్టర్ మాణిక్యరావు ● అవగాహన కల్పించిన వైద్యులు



సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు, వైద్య విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులబారిన పడిన వారికి తక్షణమే ప్రాణాలు కాపాడే సంజీవని సీపీఆర్ పద్ధతి అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలకు వైద్యులు, రిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినపుడు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఎలాంటి పద్ధతుల పాటించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే అక్కడకు విచ్చేసిన ప్రజలు, వ్యాపారులతో స్వయంగా సీపీఆర్ చేయించగా, మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీపీఆర్ చేసి, పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రావు, అనస్థీషియా ఇన్‌చార్జి డాక్టర్ చలపతి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ త్రినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ యశోవర్ధన్, మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

22నుంచి విద్యారంగ సమస్యలపై బస్సుజాత

- ఏఐఎస్ఎఫ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22నుంచి నవంబరు 12వ తేదీ వరకు ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయిస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో వారు బస్సుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యను కాపాడటంతో పాటు మూసివేసిన స్కూళ్లను పునఃప్రారంభించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, నాయకులు తాహిద్, ఇఫ్రాజ్, లోకేష్, స్టాలిన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరభద్రాచారి

సచివాలయంలో రికార్డుల తనిఖీ

కంభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభం-2 గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వీరభద్రాచారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, పలు రికార్డులను, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ప్రస్తుతం సచివాలయం పరిధిలో జరుగుతున్న సర్వేల ప్రోగ్రెస్‌ను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, రెవెన్యూ, వివిధ సమస్యలపై కార్యదర్శి, వీఆర్వోలతో చర్చించారు. హౌసింగ్‌కు సంబంధించిన వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రగతి కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న సందీప్‌రెడ్డి

కొమరోలు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో కొమరోలు ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థి కొమరోలు నరేంద ఎంపికైనట్లు ఆ కళాశాల డైరెక్టర్లు కందుల సందీప్‌రెడ్డి, ఎస్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల సింగరాయకొండలో జరిగిన ప్రకాశం జిల్లా అథ్లెటిక్ క్రీడా పోటీల్లో 100మీటర్ల పరుగు పందెంలో ప్రథమం స్థానంలో, లాంగ్ జంప్ ద్వితీయస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత సాధించి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన నరేంద్రను కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



మీర్జపేట ప్రాథమిక పాఠశాల ముందు నిల్వ ఉన్న వర్షపు నీరు

కుంటను తలపిస్తున్న పాఠశాల ఆవరణ

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తర్లుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జపేట ప్రాథమిక పాఠశాల ఆవరణ నీటి కుంటను తలపిస్తోంది. వర్షపు నీటిలో నుంచి పాఠశాల లోపలికి విద్యార్థులు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక పాఠశాల ప్రాంగణం అంతా బురదమయంగా తయారైంది. పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. చినుకుపడితే పాఠశాల ఆవరణ అంతా నీటి కుంటలా మారుతోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



కర్నూలు సభకు తరలివెళ్తున్న వ్యాపార వర్గాలు

ప్రధాని సభకు భారీగా తరలిన బీజేపీ, వ్యాపార వర్గాలు

మార్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో మార్కాపురం పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలివెళ్లారు. స్థానిక ఆర్టీసీ డిపో నుంచే సుమారు 35 బస్సులు ఈ కార్యక్రమానికి వెళ్లాయి. అంతే కాక ప్రైవేటు వాహనాల్లో కూడా పెద్ద సంఖ్యలో కూటమి పార్టీ నాయకులు, వ్యాపార వర్గాలు తరలారు. స్థానిక మెయిన్ బజార్‌లో గురువారం ఉదయం వ్యాపార వర్గాల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జీఎస్టీ ప్రభావంతో ధరలు తగ్గిన నేపథ్యంలో వ్యాపార వర్గాలు ఉత్సాహంగా కార్యక్రమానికి వెళ్లారు. స్థానిక బీజేపీ నాయకులు సుమారు 20 ప్రైవేటు వాహనాల్లో కార్యక్రమానికి తరలారు.

రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

రాచర్ల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి ఆపంట సాగు చేసే రైతుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే కంపెనీ ప్రతినిధులు లేదా ఆర్గనైజర్లపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ ఏవో షేక్ మహబూబ్ బాషా గురువారం తెలిపారు. రైతులకు విత్తనాలు అందించినప్పటి నుంచి పంట కోత కోసే వరకు సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై, ఆచరించవలసిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కంపెనీ వారిదే అన్నారు. విత్తనాలు సరఫరా చేసే కంపెనీ వారు కంపెనీల వారీగా విత్తనాల లిస్టు రైతు సేవా కేంద్రం లేదా వ్యవసాయ శాఖ అధికారికి అందించాలని అన్నారు. మండలంలోని చిన్నగానిపల్లి, చోళవీడు, జేపీ చెరువు, గుడిమెట్ట, సత్యవోలు, అనుములవీడు గ్రామాల రైతులు రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న సాగు చేస్తున్నారని, వారందరూ కంపెనీ ప్రతినిధుల నుంచి తప్పనిసరిగా ఒప్పంద పత్రాలు పొందాలని తెలిపారు. అలా ఒప్పంద పత్రం పొందితేనే రైతుకు వారి పంటకు భద్రత ఉంటుందని లేకపోతే నష్టపోతారని తెలిపారు.

సొంత నిధులతో చిల్లచెట్ల తొలగింపు

రహదారిని బాగు చేసుకున్న రైతులు



ఎక్స్‌కవేటర్‌తో చిల్లచెట్లను తొలగిస్తున్న రైతులు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ రహదారిలో నిత్యం రైతులు పొలాలకు, గ్రామాలకు వెళుతుంటారు. కానీ ఆ రహదారిలో వెళ్లాలంటే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే మండలంలోని కొలుకుల ఎస్సీ పాలెం నుంచి వీరభద్రాపురం, సాయిబాబా నగర్ వెళ్లే మట్టి రోడ్డు. సుమారు 3 కిలో మీటర్లు ఉంది. గడిచిన కాలంలో అధికారుల, నాయకుల దృష్టికి తీసుకెళ్ళినా ఎవరూ పట్టించుకోలేదు. దీనితో కొలుకుల, సాయిబాబానగర్ గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు సొంత నిధులతో ఆ రహదారిలో అల్లుకున్న పిచ్చి చెట్లను ఎక్స్‌కవేటర్‌తో గురువారం తొలగించారు. దీనికి గాను సుమారు రూ.25వేలు ఖర్చు చేసినట్లు రైతులు గోపతి శ్రీను, యార్లగడ్డ మొరళి, ఒంటెరు ఆవుల రాజు, ముండ్ల రూబేనులు తెలిపారు. వర్షాకాలంలో కావడంతో రోడ్డంతా బురద, గుంతలు ఏర్పడంతో పశువులు, ఎడ్ల బండ్లు, ద్విచక్రవాహనాల రాకపోకలు ఇబందులు పడుతున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక చరిత్రలో మైలురాయి

పలు చోట్ల అవగాహన ర్యాలీలు

పాల్గొన్న రవాణా శాఖ అధికారులు, టీడీపీ శ్రేణులు



మార్కాపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

మార్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక చరిత్రలో మైలురాయిగా నిలిచాయని మార్కాపురం ఆర్‌టీవో చందన అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమం రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున జరిగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ, టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, మార్కాపురం ఆర్టీవో చందనలు జెండాఊపి ప్రారంభించారు. స్థానిక ఎస్‌వీకేపీ కాలేజీ నుంచి సెవెన్ హిల్స్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీవో చందన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో రవాణా రంగానికి ఊతమిచ్చినట్లైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జీఎస్‌టీ అధికారి నరసింహారావు, ఎంవీఐ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఆదా



ఎర్రగొండపాలెంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న మార్కాపురం రవాణా అధికారి మాధవరావు, ఏఎంసీ చైర్మన్ సుబ్బారావు,టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబానికి రూ. 15 వేలు ఆదా అవుతుందని, వాణిజ్యషాపుల్లో ప్రశ్నించి వస్తువులపై జీఎస్టీ తగ్గించుకోవాలని మార్కాపురం రవాణా అధికారి ఎ. మాధవరావు అన్నారు. ఎర్రగొండపాలెంలో గురువారం టీడీపీ నాయకులు, రవాణా అధికారులు కలిసి జీఎస్టీపై బైక్, ఆటో ర్యాలీ నిర్వహించారు. రవాణా అధికారి ఎ. మాధవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీఎస్టీపై లబ్ధిపొందాలని అన్నారు. ఈర్యాలీలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, తోట మహేష్, మంత్రునాయక్, సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు పి. మల్లిఖార్జునరావు, చేదూరి కిశోర్, టీడీపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

పేద బడుగు వర్గాలకు ఉపయోగకరం



జీఎస్టీ అవగాహన ర్యాలీలో టీడీపీ నాయకుడు కృష్ణ కిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఆర్టీవో అధికారులు

గిద్దలూరు టౌన్ : పేద బడుగు బలహీన వర్గాలకు తగ్గిన జీఎస్టీతో ఎంతో ఉపయోగపడుతుందని టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం గిద్దలూరు పట్టణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఆర్‌టీవో చందన, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, బాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబు, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు



మద్యం సీసాలను స్కాన్‌చేసి పరిశీలిస్తున్న సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వైన్, బార్ అండ్ రెస్టారెంట్లను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా స్కానింగ్ చేసి మద్యం నాణ్యత ఎవరైనా పరీక్షించుకోవచ్చన్నారు. ఉత్పత్తి వివరాలు, తయారీ సంస్థ, లైసెన్స్ సమాచారం తదితరాలు స్కానింగ్ ద్వారా తెలుస్తాయన్నారు. దీని ద్వారా నాణ్యతలేని మద్యం విక్రయాలను అరికట్టవచ్చని అన్నారు. అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు వినియోగదారులు గుర్తిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్పీకి మించి అమ్మితే చర్యలు



ఎర్రగొండపాలెంలో మద్యం షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం, పుల్లల చెరువు,త్రిపురాంతకం మండలాల్లోని మద్యంషాపుల్లో ఎంఆర్పీకి మించి మద్యంబాటిల్స్ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎర్రగొండపాలెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మూడు మండలాల్లో గురువారం మద్యంషాపులను తనిఖీ చేసి షాపుల నిర్వాహకులకు హెచ్చరికలు చేశారు. షాపులో అమ్మే ప్రతిబాటిల్‌ను సురక్షయాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇతర వ్యక్తులకు, బెల్టుషాపులకు మద్యం విక్రయించినా మద్యం షాపు ఓనరుపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం మద్యం షాపులు ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటించాలని తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు - నమూనా సేకరణ - ప్రయోజనాలు అనే అంశంపై పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. ఒంగోలు భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని వేయబోయే పంటలకు ఎరువుల మోతాదును నిర్వహించుకుని చౌడు, ఆమ్ల గుణాల స్థాయిని తెలుసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షల వలన ఆమ్ల గుణం ఉన్న నేలలను సున్నంతో, క్షారగుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సంచాలకులు కె.రాజశ్రీ, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి శైలజారాణి, విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సిద్దేశ్వర శర్మ పాల్గొన్నారు.

రాచర్లలో

రాచర్ల : మట్టి నమూనా సేకరణ పరీక్ష విధానం గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ స్వరూప అన్నారు. రాచర్ల మోడల్ స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి హెల్త్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గురువారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల విధివిధానాలపై వివరిస్తూ మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలు పనిచేసే విధానం గురించి ఆమె వారికి తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శేషమ్మ మట్టి నమూనా సేకరించి డెమో ద్వారా వివరించి చేసి చూపించారు. మండల వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా నేల ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళి, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



కంభంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంభంలో

కంభం : మండలంలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ హెల్త్ ప్రోగ్రాం గురించి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు భూసార పరీక్షా కేంద్రం ఏవో స్వరూప మట్టి నమూనా సేకరించి పరీక్షా విధానం, మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలు, పనిచేసే విధానం గురించి వివరించారు. భూసార పరీక్ష ఏడీఏ సుచరిత, డీఆర్‌సీ ఏవో శైలజ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్ర ప్రచారం చేస్తున్న కమ్యూనిస్టు నాయకులు

విభజన హామీలు అమలు చేయలేదని నిరసన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిన మోదీ గో బ్యాక్ అంటూ కమ్యూనిస్టు నాయకులు స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులు అందె నాసరయ్య, సోమయ్యలు మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్‌కు నిధులు, గనుల కేటాయింపు, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా రాష్ట్రంలో మోదీ అడుగుపెట్టడాన్ని వ్యతిరేకించారు. ఇప్పటికైనా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. జీఎస్టీ తగ్గింపు పేరుతో ఆర్భాటాలు చేయటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫి, నన్నేసా, సురేశ్, జనుమాల నాగయ్య, అడివయ్య, సీపీఐ నాయకులు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో ప్రయోజనం ఏముంది?

రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన వలన రాష్ట్రానికి ఏమి ప్రయోజనం ఉందని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యులు సయ్యద్ జావిద్ అన్వర్ ఒక ప్రకటలో విమర్శించారు. జీఎస్టీలతో ప్రజా ధనం వృథా తప్ప సాధించేంది ఏమి లేదన్నారు. కూటమి నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కోడిగం సాయి కుమార్

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు డ్రైవర్ రెండు చోట్ల ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గండి కమలాకర్ అనే యువకుడిని అద్దంకి వైపు నుంచి దర్శి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆగకుండా కారును వేగంగా నడుపుకుంటూ వెళ్తూ పసుపుగల్లు గ్రామానికి చెందిన కోడిగం సాయి కుమార్, చొప్పరపు వెంకటేశ్వర్లు, షైలా రాములు ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్ళి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పులిపాడు సమీపంలో ఢీకొట్టడంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ముండ్లమూరు పోలీసులు దర్శిలో కారును ఆపేందుకు ప్రయత్నం చేయగా అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల మీదకు సైతం కారు పోనిచ్చే ప్రయత్నం చేసి ఆగకుండా వెళ్ళి పోయాడు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం మొద ట దర్శి, అద్దంకి ఆస్పత్రుల్లో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి..

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామ వీఆర్‌వో కావూరి దయానందం విధుల్లో భాగంగా ముండ్లమూరుకు వస్తుండగా వేంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బంధువులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తర లించారు. జమ్మలమడక వీఆర్‌వో పలగాని వేణుగోపాలరెడ్డికి కూడా తీవ్రంగా గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



అఖండ జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేస్తున్న మాతాజి

వైభవంగా అఖండ జ్యోతి ప్రజ్వలన

కనిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా దేవస్థానంలో గురువారం సిద్ధయోగిని గురు మాతాజి ఆధ్వర్యంలో వైభవంగా అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాతాజి ఏడువారాల పాటు సప్తసప్తాహ పారాయణ మహాయజ్ఞం, అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, గౌరవాధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి బాలు ఓబులురెడ్డి, సద్గురు సాయి సేవాసమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సింగరాజు మాలకొండేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకాశం, నెల్లూరు జోనల్ ఇన్‌చార్జిగా లాజరస్

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన బిషప్ లాజరస్ ఏపీబీసీ తరఫున జిల్లా అధ్యక్షుడిగా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ బిషప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఏపీబీసీ నేషనల్ ప్రెసిడెంట్ ఎం.రత్నకుమార్, బిషప్ పాల్ విక్టర్ చేతుల మీదుగా లాజరస్‌కు నియామక పత్రం అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

దర్శి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రైవేట్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దర్శి పట్టణంలో మెరుగైన వైద్యం ప్రజలకు అందేందుకు వనరులు ఏర్పడుతుండటం ఆనందదాయకమన్నారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

దొనకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గౌతమీ విద్యాసంస్థల అధినేత కె.గుండారెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలోని గౌతమీ డిగ్రీ కాలేజీలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్ ఎభ్రాయిమ్(నాని) తెలిపారు. టెన్త్ నుంచి పీజీ పూర్తి చేసిన వారు హాజరు కావాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

దర్శి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రైవేట్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దర్శి పట్టణంలో మెరుగైన వైద్యం ప్రజలకు అందేందుకు వనరులు ఏర్పడుతుండటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఐ వై.రామారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని నిరసిస్తూ సంతకాల సేకరణ

దర్శి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంపై నిర్మించటాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పట్టణంలోని కొత్తరెడ్డిపాలెంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు ధారదత్తం చేసేందుకే ప్రజాప్రభుత్వం ఈవిధానాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను చాలిచాలనీ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత భవనాలు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం హాస్టళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, నరసింహులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం ఏపీవోగా సుధాకర్

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం సీఎస్‌పురం మండల ఏపీవోగా సుధాకర్ నియమితులుకాగా, గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూలీలందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

భూసమస్యలను పరిష్కరించాలి

పామూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్యం కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. గురువారం జరిగిన ఆసంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎన్నో సంవత్సరాలుగా చుక్కల భూమి సమస్యతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రైతు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి ఎం. ప్రసాద్ అధ్యక్షత వహించగా, సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, చిన్న కొండయ్య , వై . జయరావు, కొండయ్య పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గర్భిణులు బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పెదఉల్లగల్లు పంచాయతీ కార్యదర్శి జె.రాజరాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని పెదఉల్లగల్లు పరిధిలోని అంగన్‌వాడీ - 1 కేంద్రంలో మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ స్థానికంగా దొరికే తక్కువ ధరకు దొరికే పోషకాహారాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాధాప్రియ, చైతన్య భారతి, సావిత్రి, ప్రసన్నలక్ష్మి, వెంకటరమణ, విజయలక్ష్మి, బాలమ్మ, గాలెమ్మ, శిరీష పాల్గొన్నారు.

సుంకరవారిపాలెంలో చోరీ

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంకరవారిపాలెంలో చొప్పరపు శ్రీను ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడినట్టు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.కమలాకర్ సమాచారం మేరకు.. చొప్పరపు శ్రీను కుటుంబ సభ్యులు ఈనెల 2న బీరువాలో ఉన్న బంగారాన్ని తీసుకొని వినియోగించుకున్నారు. అనంతరం బీరువాలో పెట్టుకున్నారు. గురువారం బీరువాలో చూడగా అందులో ఉన్న మూడున్నర సవర్ల బంగారం లేక పోవటంతో శ్రీను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడున్నర సవర్ల బంగారం విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ కమలాకర్ తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

దొనకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గౌతమీ విద్యాసంస్థల అధినేత కె.గుండారెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలోని గౌతమీ డిగ్రీ కాలేజీలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పల్ ఎఫ్రాయి మ్(నాని) తెలిపారు. ఈ జాబ్ మేళాలో 30 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదవ తరగతి నుండి పీజీ పూర్తిచేసిన యువతీ యువకులు హాజరుకావాలని కోరారు.

కనిగిరి అభివృద్ధిలో 'బైపాస్' మైలురాయి



కనిగిరిలో నిర్వహిస్తున్న ర్యాలీ

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించటం గర్వకారణం
- టీడీపీ పట్టణాధ్యక్షుడు ఫిరోజ్

కనిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని కనిగిరి బైపాస్‌ను ప్రారంభించటం ఓ చరిత్ర అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కర్నూలులో జరిగిన కార్యక్రమంలో వర్చువల్‌గా కనిగిరి బైపాస్‌ను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతాపూర్వకంగా కనిగిరిలో ప్రజలు, టీడీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు ఫిరోజ్ మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధిలో బైపాస్ రోడ్డు నిర్మాణం మైలురాయిగా చరిత్రలో నిలిచిపోగా, ప్రధాని ప్రారంభించటం మరో ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. పాలకుడు పాలనాదక్షతకు కనిగిరిలో ఏడాదిలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. దశాబ్దకాలంగా పాలకులు మారినా బైపాస్ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. దీంతో కనిగిరి పట్టణంలో ప్రజలు ట్రాఫిక్‌తో నానా ఇబ్బందుల పడ్డారన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పాలన చేపట్టిన ఏడాదిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఫిరోజ్ పేర్కొన్నారు. అందులో భాగంగా సుమారు రూ.70 కోట్లతో బైపాస్ నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారన్నారు. కనిగిరి అభివృద్ధిలో ఎమ్మెల్యేకు సంపూర్ణ సహకారాలు అందిస్తూ నిధులు కేటాయింపులు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రధాని ప్రారంభించటం కనిగిరికి గర్వకారణంగా నిలిచిందన్నారు.



బైపాస్ రోడ్డుపై మానవహారం నిర్వహించి ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు, టీడీపీ శ్రేణులు

తొలుత అమరావతి గ్రౌండ్స్ నుంచి పెద్దఎత్తున ప్రజలు, టీడీపీ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ చేసి, బైపాస్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, వీవీఆర్ మనోహరరావు, జంషీర్ అహ్మద్, గాయం తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నంబులు వెంకటేశ్వర్లు యాదవ్, తమ్మినేని వెంకటరెడ్డి, బుల్లాబాలబాబు, షరీఫ్, కొత్తూరు రవి, కరణం అరుణ, షేక్ వాజిదా బేగం, దొరసాని, ధనలక్ష్మి, పార్వతి, స్వప్న, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలు

- ముళ్ల పొదలతో నిండిపోయిన శ్మశానవాటిక
- వర్షం కురిస్తే అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టనట్టుగా అధికారులు

దొనకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన శ్మశానవాటికకు చేరుకునేందుకు ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. దారి కూడా సక్రమంగా లేక ముళ్లపొదలతో నిండిపోయింది. వర్షం కురిసిన సమయంలో అంత్యక్రియలు జరుపుకునేందుకు దొనకొండవాసులు నరకం అనుభవిస్తున్నారు. దొనకొండలో హిందువుల శ్మశానవాటిక అధ్వానంగా తయారైంది. ఆప్రాంతానికి వెళ్లే రహదారితో పాటు సమాధులు ఉన్న ప్రదేశంలో సహితం దట్టంగా ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. విషపురుగులు సంచారం అధికంగా ఉండటంతో దహన సంస్కారాలు చేయటానికి ఇబ్బందులు తప్పటం లేదు.



చిల్లచెట్లతో మూసుకుపోయిన శ్మశానవాటికకు వెళ్లే రహదారి

వర్షాలు కురిసిన సమయంలో మట్టిరోడ్డుకు రెండు వైపులా చిల్లచెట్లు దట్టంగా మట్టిరోడ్డును కమ్మేశాయి. దీంతో బురదలో ఆప్రాంతానికి చేరుకునేందుకు ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



సమాధులు చుట్టూ దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

ప్రభుత్వం మారినా పేరు మారలేదు!

వెలిగండ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా అధికారుల నిర్లక్ష్యంతో పలుచోట్ల పథకాల పేర్లు మారలేదు. మండలంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, పాల ఉత్పత్తి కేంద్రాలు ఇప్పటికీ వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్, జగనన్న పాల వెల్లువ పేరిట దర్శనమిస్తున్నాయి ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేర్లు మార్పుచేయాలని ఆదేశించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 12 వెల్‌నెస్ కేంద్రాల, 12 పాల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కదానికి కూడా పేరు మార్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేర్లు మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రామగోపాలపురం గ్రామంలో పేరు మార్చని పాల ఉత్పత్తి కేంద్రం

కారు ఢీకొని నలుగురికి గాయాలు

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు డ్రైవర్ రెండు చోట్ల ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గండి కమలాకర్ అనే యువకుడిని అద్దంకి వైపు నుంచి దర్శి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆగకుండా కారును వేగంగా నడుపుకుంటూ వెళ్తూ పసుపుగల్లు గ్రామానికి చెందిన కోడిగం సాయి కుమార్, చొప్పరపు వెంకటేశ్వర్లు, మైలా రాములు ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్ళి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పులిపాడు సమీపంలో ఢీకొట్టడంతో గాయపడ్డారు.

విషయం తెలుసుకున్న ముండ్లమూరు పోలీసులు దర్శిలో కారును ఆపేందుకు ప్రయత్నం చేయగా అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల మీదకు సైతం కారు పోనిచ్చే ప్రయత్నం చేసి ఆగకుండా వెళ్ళిపోయాడు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం మొదట దర్శి, అద్దంకి ఆస్పత్రుల్లో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించారు.



తీవ్రంగా గాయపడిన కోడిగం సాయికుమార్

మరో ప్రమాదంలో ఇద్దరికి..

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామ వీఆర్‌వో కావూరి దయానందం విధుల్లో భాగంగా ముండ్లమూరుకు వస్తుండగా వేంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బంధువులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

జమ్మలమడక వీఆర్‌వో పలగాని వేణుగోపాలరెడ్డికి కూడా తీవ్రంగా గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన వీఆర్‌వోలను తహసీల్దార్ ఎల్‌లక్ష్మీనారాయణ పరామర్శించారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్‌లు

- పట్టించుకోని అధికారులు

పామూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్‌లు ప్రమాదకరంగా మారాయి. పామూరు నుంచి నుచ్చుపొద గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ గుంతలమయమైంది. అడుగుకో గుంత ఉండటంతో వర్షం నీరు రోడ్డు మార్జిన్ గుంతల్లోకి చేరింది. ఎదురుగా వచ్చే వాహనాలు రోడ్డు మార్జిన్ దిగినప్పుడు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారినపడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే, స్థానిక సీఎస్‌పురం మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేపట్టలేదు. గత ఐదేళ్లగా రోడ్డు అధ్వానంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలబడటంతో వాహనదారులతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై పలుమార్లు మండల సర్వసభ్య సమావేశం దృష్టికి సభ్యులు తీసుకెళ్లారు. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖ అధికారి స్పందించి సింగరాయకొండ - మైదుకూరు 167-బి జాతీయ రహదారి పనులు సాగుతున్నాయని తెలిపారు. నుచ్చుపొ ద గ్రామం వద్ద బైపాస్ సెంటర్ నుంచి పామూరు పట్టణం మీదుగా దూబగుంట బైపాస్ జంక్షన్ వరకు జాతీయ రహదారి నిర్వహకులే రోడ్డు నిర్మాణం చేపడ తారని తెలిపారు. అప్పటివరకు కనీసం మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్డు మార్జిన్



ఛిద్రంగా సీఎస్‌పురం రోడ్డు

మల్కాపురం పంచాయతీని సందర్శించిన ఎంపీడీవో

తాళ్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామ పంచాయతీని గురువారం ఎంపీడీవో అజిత సందర్శించారు. సచివాలయంను సందర్శించి సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను, సంబంధిత సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

బయోమెట్రిక్ హాజరు సకాలంలో నమోదయ్యేలా, సకాలంలో కార్యాలయాలకు వచ్చి ప్రజలకు సేవలందించాలని కోరారు. చెత్త సంపద కేంద్రంను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంపొందించుకోవాలి



రవాణాశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై జరిగినఅవగాహన ర్యాలీ

దర్శి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సరళీకృత విధానంపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ రమేష్ సూచించారు. దర్శిలో గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు అవసరమైన 300 రకాల వస్తులపై జీఎస్టీ భారీగా తగ్గించిన విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి రవికుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీచేసిన ఎంపీడీవో

వీసీపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చింతగుంపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో జీవీ కృష్ణారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టీతో పాటు సచివాలయంకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కౌసలం సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సేవా సర్వీసులతో వచ్చే అమౌంట్‌ను నిర్ణీతసమయంలో ప్రభుత్వానికి జమచేయాలన్నారు. వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వరూపాచారి, తదితరులు పాల్గొన్నారు.

అదనపులోడ్ క్రమబద్ధీకరణకు రాయితీ

పామూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు రాయితీతో ప్రభుత్వం అవకాశం కల్పించిందని విద్యుత్ డీఈ డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకొనేలైట్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని అంచనావేసి లోడును కిలోవాట్లగా లెక్కించి సెక్యూరిటి డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. పామూరులో రెండువేల గృహవిద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరిగింది. అప్పట్లో విద్యుత్ వాడకం 0.5 కిలో వాట్ ఉంటే ఇప్పుడు అదే సర్వీసులపై 2 నుంచి 3 కిలో వాట్‌లు ఉంది. నిర్ధేశిత మొత్తం చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాల్సి ఉన్నా చాలామంది చేసుకోలేదు. అధిక విద్యుత్ వాడుతున్నా తక్కువ సామర్థ్యానికే అనుమతి తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకున్నా వేసవిలో వినియోగం పెరిగి ఆభారం విద్యుత్ ట్రన్స్‌ఫార్మర్‌లపై పడుతుండటంతో తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి సమయంలో సిబ్బంది తనిఖీ సమయంలో గుర్తిస్తే జరిమానా విధించి వేల రూపాయల్లో అదనపులోడు రుసుం వసూలు చేస్తారు. ఈక్రమంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చే వినియోగదారులకు క్రమబద్ధీకరణ రుసుంలో 50 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. డిసెంబరు నెలాఖరు నాటికి అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఆయన కోరారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

పామూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కనిగిరి ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పడమటకట్టకిందపల్లి, డీవీ పల్లె, తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. కనిగిరి నుంచి వంగపాడు, కృష్ణాపురం, వీరభద్రాపురం మీదుగా పామూరుకు వచ్చే బస్సు సమయానికి రావడంలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమయాల్లో బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని హైస్కూల్ హెచ్‌ఎం బి.సుధాకరరెడ్డి ఆర్టీసీ అధికారులరు కోరుతూ లెటర్ రాశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న పార్థసారథి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి సూచించారు. సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలోని వ్యవసాయ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ బీఎస్సీ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ డిగ్రీ తరువాత పోస్ట్ గ్రాడ్యుయేషన్, వ్యవసాయ రంగాలకు చెందిన కోర్సులు చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ వి.వీరన్నగౌడ్, ఎంఈవో రాజాల కొండారెడ్డి, కనిగిరి కెనరా బ్యాంక్ మేనేజర్ వి.సుదీప్ ప్రశాంత్, మేనేజర్ కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ నివారణకు కృషి చేయాలి

తాళ్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ నివారణకు కృషి చేయాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ అధికారి వి.అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని శివరామపురం, తాళ్లూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో గురువారం తాళ్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన నీటితో ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండవచ్చునని చెప్పారు. ఫ్లోరోసిస్ బాధితులకు ఒంగోలు రిమ్స్‌లో తగిన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరామపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజిత, పీహెచ్‌ఎన్ వై.విజయమ్మ, ఫ్లోరోసిస్ ఎల్‌టీ అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ జ్యోతి ప్రజ్వలన

కనిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా దేవస్థానంలో గురువారం సిద్ధయోగిని గురు మాతాజి ఆధ్వర్యంలో వైభవంగా అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాతాజి ఏడువారాల పాటు సప్తసప్తాహ పారాయణ మహాయజ్ఞం, అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, గౌరవాధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి బాలు ఓబులురెడ్డి, సద్గురు సాయి సేవాసమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సింగరాజు మాలకొండేశ్వరరావు, మండ్లా వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



అఖండ జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేస్తున్న మాతాజి



గుండ్లకమ్మకు భూసేకరణ వేగంగా చేపట్టాలి

బాపట్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై సంబంధితశాఖల అదికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవటంతోనే జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావటంలేదని చెప్పారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరులో 50ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవటంపై ఆరాతీశారు. తక్షణమే భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు.



సూపర్ జీఎస్టీ సైకత శిల్పం వద్ద కలెక్టర్ వి.వినోద్‌కుమార్, అధికారులు

పర్యాటకాభివృద్ధికి చర్యలు

- జిల్లాకు రూ.97.52 కోట్లు మంజూరు
- జీఎస్టీ అవగాహనలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు సూర్యలంక సముద్రతీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని గురువారం అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి రూ.97.52 కోట్లు మంజూరయ్యాయన్నారు. సూర్యలంక బీచ్‌లో టాయిలెట్లు, స్నానపు షవర్లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, దుస్తుల మార్పు గదులు, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వారంరోజులు షాపింగ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీచ్‌లో విషాద ఘటనల నివారణకు బీచ్ వద్ద 15 మంది గజ ఈతగాళ్లను, నాలుగు బోట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రభాకర్, మెప్మాపీడీ సత్యానంద్‌పాల్, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గ్లోరియాకుమారి, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బర్లీకి గడువు పెంపు



పర్చూరు మార్కెట్‌యార్డులో బర్లీ పొగాకు కొనుగోళ్లు (పాత చిత్రం)

రూ.128 కోట్లు మిగులు

మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. మార్క్‌ఫెడ్ గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు రూ.145 కోట్ల విలువైన బర్లీ పొగాకును మాత్రమే కొనుగోలు చేశారు. అంటే కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.128 కోట్లు మిగులు ఉన్నట్లు సమాచారం. ఈ నెల 25తో కొనుగోళ్లకు తెరపడనుంది. ప్రస్తుతం ఉన్న మూడు కేంద్రాల్లో గడువు ముగిసే నాటికి గరిష్ఠంగా ఇంకో రెండు వేల క్వింటాళ్ల బర్లీ సేకరణ జరగొచ్చని అంచనా. కేటాయించిన నిధుల్లో భారీగా మిగులుపై మార్క్‌ఫెడ్ నుంచి పొంతన లేని సమాధానాలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కొనుగోళ్ల లేక ఆందోళనలో ఉన్న బర్లీ రైతులకు ఉపశమనం కలిగిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం జూన్ నుంచి కొనుగోళ్లు చేపట్టింది. సెప్టెంబరు నెలాఖరుతో బర్లీ కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే రైతుల వద్ద ఇంకా భారీగా నిల్వలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్ నివేదికల ఆధారంగా అక్టోబరు 15 వరకు కొనుగోళ్లు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఆ గడువు కూడా ముగిసింది. అయినా ఇంకా నిల్వలు భారీగా ఉండటంతో బర్లీ రైతుల కోసం రెండోసారి పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ నెల 25 వరకు బర్లీ పొగాకును కొనుగోలు చేయడానికి షెడ్యూల్ ఇచ్చినట్లు మార్క్‌ఫెడ్ ప్రకటించింది. అయితే బాపట్ల జిల్లాలో బర్లీ నిల్వలు అధికంగా ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉన్నాయి. ప్రస్తుతం మూడు కేంద్రాల్లో మాత్రమే బర్లీ పొగాకు సేకరణ జరుగుతుంది. క్షేత్రస్థాయిలో రైతుల వద్ద ఇంకా దాదాపు 50,000 క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

ఈ నెల 25 వరకు కొనుగోళ్లు

- మూడు కేంద్రాల్లో కొనసాగుతున్న సేకరణ
- ఇంకా రైతుల వద్ద దాదాపు 50,000 క్వింటాళ్లు

ప్రతిబంధకంగా నిల్వ సమస్య

నాలుగు జిల్లాల పరిధిలో పెద్దఎత్తున కేంద్రాలను ఏర్పాటు చేసి నాలుగు నెలల నుంచి మార్క్‌ఫెడ్ రైతుల నుంచి బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. ఇప్పటికే బాపట్ల జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లో కూడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్‌లన్నింటిని బర్లీ పొగాకు నిల్వల కోసం మార్క్‌ఫెడ్ తీసుకుంది. అయితే ప్రస్తుతం ఎక్కడ కూడా బర్లీ నిల్వల కోసం గోదాములు అందు బాటులో లేవు. అయితే ఆ పొగాకు నిల్వలకు గిడ్డంగుల లభ్యత ప్రతిబంధకంగా మారింది. దీంతో కొనుగోలు కేంద్రాలను తగ్గించారు. దీంతో కొనుగోళ్లు మందగించడం.. అదే సమయంలో గడువు కూడా ముగిసింది. అయితే రైతుల అభ్యర్థనల మేరకు ఇప్పటికే రెండు సార్లు కొనుగోళ్లకు సం బంధించి గడువు పెంచారు.

2,11,000 క్వింటాళ్ల సేకరణ

ఇప్పటి వరకు నాలుగు జిల్లాల పరిధిలో 2,11,000 క్వింటాళ్ల పొగాకును మార్క్‌ఫెడ్ సేకరించింది. ఇందులో బాపట్ల జిల్లా వాటా 1,42,500 క్వింటాళ్లు ఉండగా, గుంటూరు జిల్లాలో 32,500, పల్నాడు జిల్లాలో 23,000, ప్రకాశం జిల్లాలో 13,000 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.93 కోట్లు జమయ్యాయి. ఇంకా రూ.52 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.

చినుకుపడితే చిత్తడి

- వర్షాలతో అధ్వానంగా రోడ్లు
- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
- జీతాల్లేక విధులకు రాని కార్మికులు..



మురుగునీటితో ఈపూరుపాలెంలో ఓ వీధి

చీరాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలు కారణంగా ప్రధాన రహదారులు కోతకు గురవుతున్నాయి. నీళ్ల నిండి వంకలను తలపిస్తున్నాయి. కొన్ని రోడ్లు మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కోతకు గురయిన రోడ్లలో వాహనదారులు పట్టుతప్పుతున్నారు. గతంలో రోడ్లకు పాలకులు మరమ్మతులు చేపట్టినా.. పనుల్లో పారదర్శకత ఎక్కడా కనిపించడం లేదు. ఈపూరుపాలెం నుంచి పలు ప్రాంతాల రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, భారీ వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గుంతలతో.. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన బలహీనపడింది. సైడ్ దిమ్మెలు పూర్తిగా ఇరిగిపోయాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు చెబుతున్నారు.



ప్రమాద భరితంగా ఈపూరుపాలెం వంతెన

అధ్వానంగా పారిశుధ్యం..

ఎన్నికలు లేని కారణంగా పంచాయతీలకు నిధుల్లేవు. దీంతో పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు అందడం లేదు. ఒక్కో పంచాయతీలో నాలుగు లేక నెలల తరబడి జీతాలు నిలిచిపోయాయి. దాదాపుగా నియోజకవర్గంలో సింహభాగం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనులకు మొరాయించారు. దీంతో వీధులు అధ్వానంగా మారాయి.

జీఎస్టీ 2.0తో ప్రజలకు మేలు

రవాణాశాఖ ర్యాలీలో జేసీ భావన వశిష్ఠ

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో పేదలకు మేలు జరుగుతుందని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ కార్యాలయం వద్ద జేసీ వశిష్ఠ, బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబులు ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగిన ర్యాలీలో డ్రైవర్లు వాహనాలతో, ప్రజలు ప్లకార్డులతో పాల్గొన్నారు. సూపర్ జీఎస్టీ ద్వారా జరిగే మేలు గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, జిల్లా క్రీడాధికారి పాల్‌కుమార్ పాల్గొన్నారు.



జీఎస్టీ ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ భావన వశిష్ఠ , బాపుడా ఛైర్మన్ రాజశేఖర్‌బాబు



రైస్ మిల్లులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- కూచిపూడిలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు అవసర మైన అన్ని ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కూచిపూడిలో రైస్‌మిల్లును, రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం సేకరణకు, నిల్వలకు అవసర మైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు కోతలు ప్రారంభం అవుతాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులో, రైతు సేవా కేంద్రంలో నిల్వకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకో వాలన్నారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ నెహ్రూబాబు, ఏవో హేమంత్ భరత్‌కుమార్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

నవంబరు మూడో వారం నుంచి సేకరణ

బాపట్ల: జిల్లాలో ధాన్యం సేకరణ నవంబరు మూడో వారం నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ధాన్యం సేకరణ, పెన్షన్ రీఅసెస్మెంట్, స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ, ఈ-పంట తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు అందజేయరాదన్నారు. ధాన్యం సేకరణ సమయంలో ప్రతీ రైస్‌మిల్లుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ఆర్డీవోలకు సూచించారు.

పీజీఆర్ఎస్ సెల్‌లో తనిఖీలు..

పీజీఆర్ఎస్ సెల్‌ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదుల నమోదు, పరిష్కారం, సంబంధితశాఖల స్పందన విధానాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ నేరుగా ఓ అర్జీదారుడికి ఫోన్ చేసి సమస్య వివరాలు తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో అందజేసే పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. మాతృ మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరి గింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భం దాల్చిన వారిని మొదటి మూడునెలల్లో నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భవతులను సకాలంలో గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలను గురించి ప్రజలకు తెలియజేసి, కాన్పు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, డీఐవో డాక్టర్ రత్నమన్మోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ రామకృష్ణ హనుమాన్, డాక్టర్ రాజేష్, డాక్టర్ జయసింహ, ఎస్.సుగుణమ్మ, ఐసీడీఎస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగకు స్వస్థలాలకు వచ్చి వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రజా సంబంధాల అధికారి వినయ్ కాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07497 తిరుపతి - సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 17న రాత్రి 7.40కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.30కి తెనాలి, 2.20కి గుంటూరు, 3 గం టలకు సత్తెనపల్లి, 18న వేకువజామున 4 గంటలకు నడికుడి, ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. 07213 విజయవాడ - సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 6.25 గంటలకు బయలుదేరి 7.03కి మంగళగిరి, 7.30కి గుంటూరు, 8.18కి సత్తెనపల్లి, 8.48కి పిడుగురాళ్ల, 9.18కి నడికుడి, మధ్యాహ్నం 12.18కి చర్లపల్లి, ఒంటి గంటకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. 07214 సికింద్రాబాద్ - విజయవాడ స్పెషల్ ఈ నెల 17, 18 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 4.18కి చర్లపల్లి, 6.28కి నడికుడి, 6.58కి పిడుగురాళ్ల, రాత్రి 7.28కి సత్తెనపల్లి, 8.25కి గుంటూరు, 8.58కి మంగళగిరి, 9.30కి విజయవాడకు చేరుకుంటుంది.

కొట్టేసింది రూ.కోట్లు.. రికవరీ సున్నా..



జిల్లా	దుర్వినియోగం (రూ.కోట్లలో)	రికవరీ
పల్నాడు	1.99	0.00
బాపట్ల	2.15	0.00
గుంటూరు	0.83	0.00
మొత్తం	4.97	0.00

- ఉపాధి పనుల్లో రూ.4.97 కోట్లు స్వాహా
- సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- అక్రమార్కులపై చర్యలు శూన్యం

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

వలసలు తగ్గించి, పేదలకు నివసించే చోటే పని కల్పించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. అందిన కాడికి దోచుకుంటున్నారు. ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినా చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో అక్రమార్కులు రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్నారు. తిలా పాపం.. తలా పిడికెడు.. అన్న చందంగా ఇందులో అందరి పాత్ర కనిపిస్తోంది. కూలీల కష్టాన్ని దోచుకున్నది కొందరైతే, దొంగ మస్టర్లతో సొమ్ము పక్కదారి పట్టించింది మరి కొందరు. రూ.కోట్లల్లో నిధులు పక్కదారి పట్టినట్లు బయటపడినా చర్యలు లేవు. సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్న ఉదంతాలే ఇందుకు నిదర్శనం. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఉపాధి పనుల్లో రూ.4.97 కోట్ల దుర్వినియోగం జరిగినట్లు సోషల్ ఆడిట్‌ల ద్వారా నిర్ధారించారు. కానీ, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా అక్రమార్కుల నుంచి రికవరీ చేయలేదంటే.. ఏ స్థాయిలో వారికి అండదండలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాల్లో.. రూ.కోట్లల్లోనే అవినీతి

పనికి హాజరు కాని కూలీలతో కుమ్మక్కై మస్టర్లలో పేర్లు నమోదు చేసి.. డబ్బులు జమయిన తర్వాత ఉపాధి సిబ్బంది పంచుకుంటున్నారు. చేయని పని చేసినట్లుగా.. పాత పనినే కొత్తగా చేసినట్టు చూపించి సొమ్ము కాజేస్తున్నారు. పలు చోట్ల నకిలీ జాబ్ కార్డుల‌కు బ్యాంకు ఖాతా సృష్టించి అవినీతికి పాల్పడ్డారు. ఇందులో కొందరు క్షేత్రస్థాయి సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు భాగస్వాములు అయ్యారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో జిల్లాలో రూ.కోట్లల్లోనే అక్రమాలు వెలుగు చూశా యి. మొక్కుబడిగా సామాజిక తనఖీలు చేస్తూ.. అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్స రానికి రూ.4.97 కోట్లు అవినీతి జరిగినట్లు తేలింది. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి.. ఉద్యోగాల నుంచి తొలగించాలి. వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలి. చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యమైన మద్యానికి.. సురక్షయాప్

- ఇక కల్తీ మద్యం నివారణ సులభతరం
- తనిఖీల్లో ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యం కోసం కొను గోలుదారులు సురక్షయాప్‌ను వినియోగించుకోవాలని ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. బాపట్లలో గురువారం పలు మద్యం దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం బాటిళ్లపై స్కానింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష పేరుతో కన్స్యూమర్, రిటైలర్ల కోసం ప్రత్యేకంగా రెండు యాప్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్‌లను ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని మద్యం సీసాపై స్కాన్ చేస్తే సదరు మద్యం సీసాకు సంబంధించిన సమగ్ర వివరాలు అందులో కనిపిస్తాయన్నారు. దీనివల్ల సదరు మద్యం అసలా, నకిలీదో పసిగట్టవచ్చన్నారు. జిల్లాలో అనధికార మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎవరైన తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



మద్యం దుకాణంలో బాటిల్‌ను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు

మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ..!

రైతుల నుంచి అరువుపై సరుకు కొనుగోలు

గోడౌన్‌లో నిల్వ ఉంచి బ్యాంకులో రుణం

గుట్టుగా విక్రయం.. అక్రమ తరలింపును అడ్డుకున్న రైతులు

మార్టూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు.. రైతుల నుంచి అరువుపై కొనుగోలు చేసిన పంటను వారికి తెలియకుండా బ్యాంకులో కుదవపెట్టినట్టు చూపి గుట్టుగా సరుకు దాటించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసి బాధిత రైతులు అడ్డుకున్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో వరికల్లు నాగేశ్వరరావు అలియాస్ నాగు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగుతోంది. ఆయన మూడు నెలల క్రితం రైతుల వద్ద నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి కొనంకిలోని తన గోడౌన్‌లో నిల్వ చేసుకున్నాడు. అనంతరం రైతులకు నగదు చెల్లించకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రైవేటు ఆన్‌లైన్ ప్రైవేటు సంస్థతోపాటు తాను బాకీ ఉన్న కొంతమందికి సరుకును స్వాధీనం చేశారు. వారు ఒకటి రెండు పర్యాయాలు గుట్టుగా ఇక్కడి నుంచి సరుకును అక్కడి నుంచి తరలించారు. గురువారం కూడా అలానే సరుకు తరలిస్తుండగా, కొంతమంది రైతులు గొడౌన్ వద్ద అడ్డుకున్నారు. తమకు డబ్బులు చెల్లించకుండా సరుకు ఎలా తీసుకెళతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడౌన్ వద్ద ప్రైవేటు బ్యాంక్ వారికి అడ్డుతగిలారు. వారి మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. సమాచారం అందుకున్న సీఐ ఎం శేషగిరిరావు, ఘటనా స్థలం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం నాగేశ్వరరావు కోనంకి గ్రామంలో లేకపోవడంతో, శుక్రవారం నాగేశ్వరరావును పిలిపిస్తామని చెప్పి పంపించారు. అప్పటివరకు సంయమనం పాటించాలని, తర్వాత అందరి సమక్షంలో మాట్లాడతానని రైతులకు సీఐ చెప్పడంతో రైతులు నాగేశ్వరరావు రాకకోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది.

పోషకాహార ప్రాధాన్యతను గుర్తించాలి

● సీడీపీవో సుభద్ర



పర్చూరులో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

పర్చూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోషకాహార ప్రాధాన్యత ఆవశ్యకతను గుర్తించాలని దీనిపై సీడీపీవో జి.సుభద్ర అన్నారు. పోషణ మాసోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్‌బేబీ ప్రదర్శనల విజేతలకు బహుమతులు అందజేశారు. పౌష్టికారం తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఎంఈవో వెంకట్రామయ్య మాట్లాడుతూ బాలికలలో ప్రతిభను వెలికితీసే దిశగా ఐసీడీఎస్ శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆయా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధిశునకాలతో బెంబేలు



చెన్నుపల్లి సమీపంలో నడి రోడ్డు మీద మకాం వేసిన వీధి శునకాలు

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వీధి శునకాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పగలురేయి అన్న తేడా లేకుండా వీధి శునకాలు వీధుల వెంట స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వీధికుక్కలు అధికంగా ఉన్నాయి. బల్లికురవ, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం, మల్లాయపాలెం, కొప్పెరపాడు, కొణిదెన, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, నక్కబొక్కలపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ఉప్పుమాగులూరు, వేమవరం గ్రామాలలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పలు గ్రామాలలో ఇప్పటికే పలువురిని కుక్కలు కరిచి వైద్యశాల బారిన పడ్డారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే గ్రామాలలో వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బెయిల్‌పై ముప్పా సురేష్ విడుదల

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితుడు ముప్పా సురేష్‌కు బెయిల్ మంజూరు కాగా గురువారం ఒంగోలులోని జిల్లా జైలులో ఉన్న ఆయన విడుదల అయ్యారు. అయితే ప్రతి ఆదివారం ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని నిబంధన విధించారు. ఆగస్టు 18న అరెస్టు అయిన సురేష్ 59 రోజుల పాటు రిమాండ్ లో ఉన్నారు.

రేపు చెకుముకి పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 18వతేదీన చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

సూపర్ జీఎస్టీతో తగ్గిన వాహనాల ధరలు

● డిప్యూటీ కమిషనర్ సుశీల

● రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల చిన్న వాహనాల ధరలు తగ్గినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. గురువారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డు నుంచి బాపూజీ కాంప్లెక్స్ వరకు సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఆధ్యరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ రవాణాకు వినియోగించే స్మాల్ వెహికిల్స్‌పై జీఎస్టీ 28 శాతం నుంచి 18శాతం వరకు తగ్గించారన్నారు. ఆటోరిక్షా, మోటార్ కారు, క్యాబ్స్, లారీలు, బస్సులు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గించడంతోపాటు 5నుంచి 12శాతం వరకు రాయితీ ఉంటుందని చెప్పారు. గతంలో రూ.9.80 లక్షలు ఉన్న మినీ ట్రక్కుకు తగ్గించిన జీఎస్టీ 10శాతం ప్రమాదకం రూ.2.75లక్షలు, అదే వాహనంపై పన్ను రాయితీ రూ.1.4లక్షలు ధర తగ్గుతుందన్నారు. చిన్న వాహనాలు గతం కంటే 50 శాతం ధరలకే వాహనాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్డీవో కళావతి, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ డి.సత్యప్రకాష్ పాల్గొన్నారు.



ర్యాలీ ముందుభాగాన మాట్లాడుతున్న డిప్యూటి కమిషనర్ సుశీల

గుండెజబ్బుల బాధితులకు సంజీవని 'సీపీఆర్'

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులబారిన పడిన వారికి తక్షణమే ప్రాణాలు కాపాడే సంజీవని సీపీఆర్ పద్ధతి అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూర గాయల మార్కెట్ వద్ద ప్రజలకు వైద్యులు, రిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినపుడు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఎలాంటి పద్ధతుల పాటించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే అక్కడకు విచ్చేసిన ప్రజలు, వ్యాపారులతో స్వయంగా సీపీఆర్ చేయించగా, మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీపీఆర్ చేసి, పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రావు, అనస్థీషియా ఇన్‌చార్జి డాక్టర్ చలపతి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ త్రినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రనీత్, డాక్టర్ యశోవర్ధన్, మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు, వైద్య విద్యార్థులు

స్వచ్ఛమిత్రతో నగర పారిశుధ్యం మెరుగు

కమిషనర్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణ కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న స్వచ్ఛమిత్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీసీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పారిశుధ్య విభాగం సిబ్బంది, శానిటరీ సెక్రటరీలకు స్వచ్ఛమిత్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడిచెత్త సేకరణలో భాగంగా పొడి చెత్తను సంపద కింద మార్చే ప్రక్రియను స్వచ్ఛమిత్ర ద్వారా చేపట్టనున్నట్లు చెప్పారు. అందుకోసం ఐటీసీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని వివరించారు. కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ స్కీమ్ కింద నిర్వహించే ఈ కార్యక్రమం పైలట్ ప్రాజెక్టుగా ఒంగోలు కార్పొరేషన్‌ను ఎంచుకున్నారన్నారు. తద్వారా పొడి చెత్తను ప్రత్యేకమైన మిషన్‌లో శుభ్రపరిచి, పలు కంపెనీలకు సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. అందుకోసం ఐటీసీ కంపెనీ ప్రతినిధులు ప్రతి ఐదు డివిజన్‌లకు ఒకరు ఉంటారని, వారు కార్పొరేషన్ శానిటరీ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేస్తారని తెలిపారు. నగర సుందరీకరణ కోసం చేపడుతున్న బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ కోరారు. మూడు సంవత్సరాలపాటు స్వచ్ఛమిత్ర, కార్పొరేషన్‌తో కలిసి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమాకాంత్, ప్రతినిధి సుధ, సోషల్ యాక్టివిటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సునీల్, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, ఎన్.పిచ్చయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా వైసీపీ

● ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్



షారోన్, గౌతమ్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న వెంకటేష్

కొత్తపేట (చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సముద్ర తీరంలో అలల తాకిడికి మృతి చెందిన షారోన్, గౌతమ్ కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుందని, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. గురువారం కొత్తపేటలోని బాధిత కుటుంబ సభ్యుల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఘటనపై ఆరా తీసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ వ్యవస్థ తీరును నిరసిస్తూ, మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

● గుండ్లకమ్మ ప్రాజెక్టుపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై సంబంధితశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవటంతోనే జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావటంలేదని చెప్పారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవటంపై ఆరాతీశారు. తక్షణమే భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 17గేట్లు మరమ్మత్తులు పూర్తి కాగా మరొకటి పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ ద్వారా బీడుభూములకు సాగునీరు అందించటం లక్ష్యమన్నారు. తాజాగా బాపట్లజిల్లాలో 2,600 ఎకరాలభూమి ఆయుకట్టు పరిధిలోకి తీసుకురావటానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 78 ఎకరాల భూమి ఆయుకట్టులోకి తెచ్చేందుకు జలవనరులు, వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాలలో మూడు గ్రామాలలో 1100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్‌లకు సూచించారు. సమావేశంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉపకలెక్టర్‌లు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం (చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత నెల 19న ఈ నెల 8-10 మధ్య 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డివిజన్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వేటపాలెం మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈక్రమంలో గురు వారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షేమ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు

● సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆ పార్టీ నాయకులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ.హుస్సేన్ తదితర నాయకులు నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర కాలేజీ వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్టీ బాలుర వసతి గృహం ఆవరణ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వసతిగృహాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల సాంఘికసంక్షేమశాఖ మంత్రి వసతిగృహాలను సందర్శించి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖతార్ తెలుగు సంఘం ఎన్నికలలో ప్రకాశం వాసి విజయం

అవీఇవీ

తన ప్యానల్‌లోని పది మందిని గెలిపించి సత్తాచాటిన గొట్టిపాటి రమణ



విజయోత్సవ సభలో విక్టరీ సింబల్ చూపుతున్న రమణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతార్‌లోని ఆంధ్ర కళా వేదిక అనే తెలుగు ప్రవాసీ సంఘానికి ఉత్కంఠభరితంగా జరిగిన ఎన్నికలలో ప్రకాశం జిల్లా మారుమూల గ్రామానికి చెందిన ప్రవాసీ గొట్టిపాటి రమణ విజయం సాధించారు. భారతీయ ఎంబసీ అధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వీటి ఫలితాలను బుధవారం రాత్రి ప్రకటించారు. తాను విజయం సాధించడమే కాకుండా తన ప్యానల్ నుంచి పోటీ చేసిన మరో పది మందిని కూడా గెలిపించిన రమణ ఖతార్‌లోని తెలుగు ప్రవాసీ సమాజంలో తన సత్తాను చాటారు. జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ ఖతార్‌లో ప్రముఖ ఇంజినీర్, జిల్లాకు చెందిన అనేక మంది యువకులకు ఖతార్‌లో ఉపాధి కల్పించిన ఆయనకు అందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. టీడీపీ ఖతార్ శాఖ అధ్యక్షుడు కూడా అయిన రమణ అక్కడి భారతీయ సామాజిక సేవకులలో ఒకరు.

బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలి

పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంక్‌లు

సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఒంగోలు నగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ సమావేశం హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణనే ప్రధాన లక్ష్యంగా వసతి గృహాల సంక్షమ అధికారులు పనిచేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు తాగునీరుగా అందించాలని చెప్పారు. హాస్టళ్లను, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మెనూను కచ్చితంగా అందించాలని కోరారు. ఇక నుంచి పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంకులు కేటాయిస్తామన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖరరాజు, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల కార్యదర్శి మాధవీలత, నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటలక్ష్మి, ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి నిర్మల జ్యోతి, నెల్లూరు, జిల్లాల్లోని వసతి గృహాల సంక్షేమశాఖాధికారులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

టంగుటూరు (కొండపి), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కారుమంచి గ్రామంలో జరిగింది. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన కథనం ప్రకారం.. కారుమంచి గ్రామానికి చెందిన దామవరపు అరవింద్ చీరాలకు చెందిన వహీద (26) ప్రేమించుకుని పెద్దల సమ్మతితో 2019లో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి వారు కారుమంచిలో నివాసం ఉంటున్నారు. వహీదాకు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడు తున్నారు. ఈ క్రమంలో గురువారం విపరీతంగా వహీదాకు కడుపునొప్పి రావడంతో భరించలేక బుధవారం ఉదయం ఇంటిలో ఉన్న ఎలుకల మందు తిన్నది. ఆమెను భర్త ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆమె మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్







'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు







శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



పొలాల వెంబడి పరుగులు

అవీ..ఇవీ..

గ్రామస్థులకు మొక్కల పంపిణీ


గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

యద్దనపూడి,(మార్టూరు), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ యూనివర్సల్ టుబాకో వారి సంయుక్త ఆధ్వర్యంలో యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామానికి 400 మొక్కలను పంపిణీ చేశారు. దీంతో గురువారం ఈ మొక్కలను టీడీపీ గ్రామ నాయకులు గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ తదితరులు గ్రామస్థులకు పంపిణీ చేశారు. గతంలో కూడా ఈ సంస్థ వారు గ్రామానికి చెందిన చెరువు కట్టపై మొక్కలను నాటారు. చెరువులో పూడికతీతమట్టిని తీసి, చెరువు కట్టను పటిష్టం చేశారు. వారు గ్రామస్థులకు జామ, మామిడి, నిమ్మ, సపోటా, సీతాఫలం, నేరేడు తదితర మొక్కలను పంపిణీ చేశారు. గ్రామస్తులందరూ ఐక్యంగా కలిసి మెలిసి నాటిన మొక్కలు పెరిగే విధంగా కృషి చేయాలని, పర్యావరణాన్ని రక్షించాలని సంస్థ ప్రతినిధులు రత్నకుమార్, విక్రమ్ లు గ్రామస్థులను కోరారు.

అవకతవకలకు పాల్పడిన బ్యాంకు మేనేజర్‌పై కేసు నమోదు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో ఖాతాదారులకు తెలియకుండా వారి అనుమతులు లేకుండా వారి పేర్లపై లావాదేవీలు జరిపి అవకతవకలకు పాల్పడిన కొణిదెన స్టేట్‌బ్యాంకు పూర్వ మేనేజర్ అయప్పపై గురువారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కొణిదెన స్టేట్‌బ్యాంకులో 2022- 23 సంవత్సరంలో అయప్ప అనే వ్యక్తి మేనేజర్‌గా పనిచేసిన కాలంలో తమ బంధువులు ఇతరులకు చెందిన 58 అకౌంట్లకు వారి అనుమతులు లేకుండా ఎలాంటి రశీదులు నమోదు చేయకుండా రూ. 13 లక్షల మేర లావా దేవీలు జరిపి బ్యాంకు నిధులను పక్కదారి పట్టించాడు.. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు కూడా విచారించి అవకతవకలు చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఇప్పుడు విధులలో ఉన్న మేనేజర్ రమేష్ పూర్వపు మేనేజర్ చేసిన అవకతవకలపై బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో కొణిదెన బ్యాంకులో పూర్వపు మేనేజర్ అయప్పపై అదే బ్యాంకులో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగి కూడా బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తన సొంత బంధువులకు రాయితీ రుణాలను కూడా మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ ఆంజనేయులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రేణంగివరం, అలవలపాడు, కశ్యాపురం, జాగర్లమూడి వారిపాలెం, ముప్పవరం, బైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, కొండమూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపవేస్తున్నట్లు ఏఈఈ ఆంజనేయులు తెలిపారు.

● **అద్దంకి సబ్‌స్టేషన్ పరిధిలో..**

అద్దంకి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌కు కొత్తలైన్ ఏర్పాటు పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. మండలంలోని తిమ్మాయపాలెం, గోపాలపురానికి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, మౌలానగర్, కలవకూరు రోడ్డు, ద్వారకానగర్, ఆటోనగర్, శింగరకొండ తదితర ప్రాంతాలలో మధ్యహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై డ్రోన్ సాయంతో దాడి

● ఐదుగురు జూదరులను అరెస్టు చేసిన పోలీసులు

ఇంకొల్లు, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సమీపంలోని పేకాట స్థావరంపై సీఐ వైవీ.రమణయ్య గురువారం డ్రోన్‌సాయంతో దాడులు నిర్వహించారు. పర్చూరు రోడ్డు సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.5030 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

సుధీర్‌కు క్వారీ యజమానుల జన్మదిన శుకాంక్షలు


గజమాలను వేస్తున్న ఉప్పుటూరి కృష్ణ, ఆయన మిత్రులు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం బల్లికురవ లక్ష్మీ గ్రానైట్ క్వారీ ఇన్‌చార్జ్ ఉప్పుటూరి కృష్ణ ఆధ్వర్యంలో ఒంగోలు తరలి వెళ్లి సుధీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గజమాలను వేశారు. ఈసందర్భంగా లక్ష్మీ గ్రానైట్ క్వారీ సిబ్బందితో పాటు బల్లికురవ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఫ్యాక్టరీల యజమానులు, గ్రామ నేతలు సుధీర్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఒంగోలు తరలి వెళ్లారు.

అపరిశుభ్రంగా గ్రామాలు -ప్రమాదభరితంగా వీధులు

● నాన్పుడు వర్షంతో ప్రబలుతున్న రోగాలు
● విధులకు రాని పారిశుధ్య కార్మికులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరపిలేని నాన్పుడు వానతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులు సైతం నీళ్ల నిండి కాలువలను తలపిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని రోడ్ల మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరికొన్ని రోడ్లు కోతకు గురికావడంతో ఆ ప్రాంతాల్లో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. గతంలో పాలకులు మరమ్మతులు చేపట్టిన అది క్షేత్రస్థాయిలో అమలు జరగలేదు. కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టినా, సేవలు పారదర్శకంగా లేకపోవడంలో నీళ్లుభారీగా నిలుస్తున్నాయి. ఈపూరుపాలెం వద్ద నుంచి పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. దీంతో నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, భారీ వాహనాల వారు నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా వంతెనపై గుంతలు పడుతున్నాయి. దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అంచుల్లో ఉన్న దిమ్మెలు పూర్తిగా విరిగిపోయాయి. దీనికి తోడు నాన్పుడు వాన తోడు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన అవసరాలకు అనుగుణం గా నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు చెబుతున్నారు.


ప్రమాదభరితంగా ఉన్న ఈపూరుపాలెం వంతెన


ఈపూరుపాలెంలో అధ్వానంగా ఓ వీధి

జీతాలు లేక పనులకు రాక..

ఎన్నికలు లేని కారణంగా పంచాయతీలకు నిధుల్లేవు. దీంతో పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు అందడం లేదు. ఒక్కో పంచాయతీలో నాలుగు లేక ఆపైనే మాసాలకు సంబంధించి జీతాలు నిలిచాయి. దీంతో దాదాపుగా నియోజకవర్గంలో సింహ భాగం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనులకు మొరాయించారు. ఈ క్రమంలో వీధులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

బాణసంచా దుకాణాలలో జాగ్రత్తలు పాటించాలి

గోడౌన్లను పరిశీలించిన ఆర్‌డీవో, డీఎస్పీ

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల వద్ద అన్ని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. పట్టణంలోని శింగరకొండ రోడ్డు, ఒంగోలు రోడ్డులలోని బాణసంచా లైసెన్స్‌డ్ దుకాణాలను గురువారం సాయంత్రం ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు చీరాల డీఎస్పీ మొయిన్‌లు పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆకస్మికంగా ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ శ్రీచరణ్, సీఐ సుబ్బరాజు, ఆర్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాకర్స్ గోడౌన్ నిర్వాహకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్ చెప్పారు. గురువారం వేటపాలెం, కారంచేడు మండల పరిధిలోని గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పరిసరాల్లో ప్రమాదల నియంత్రణకు తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట అగ్నిమాపక శాఖ ఏడీ రామకృష్ణ, తహసీల్దార్‌లు గీతారాణీ, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.


గోడౌన్లను పరిశీలిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మొయిన్

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ రమేష్

సంతమాగులూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ద్వారా గర్భిణులు, బాలింతలకు బాలికలకు ప్రభుత్వం పౌష్టికారం అందజేస్తోందని, సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు న్యూట్రిషియన్ స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాలతో చేసిన వంటలను రుచి చూశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి సారే అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సేవలందించిన వారికి ప్రతి సెక్టార్ నుంచి ఒక ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తలను గుర్తించి వారికి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కొప్పరం పంచాయతీలోని నెహ్రూ నగర్ అంగన్వాడి టీచర్ మొగిలి తిరుమల తన 13 సంవత్సరాల కుమారుడు సిద్ధార్థ అండర్-14వ జట్టు కింద అంతరాష్ట్ర క్రికెట్ జట్టులో గెలిచినందుకు తిరుమలను ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, సీడీపీవో డి సుధ, ఐసీడీఎస్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీ ఎస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, రెండు మండలాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


పోషణ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ఛైర్మన్

చక్కటి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

ఇంకొల్లు : చక్కటి ఆరోగ్యకర అలవాట్లతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇంకొల్లు సీడీపీవో సులోచనరాణి అన్నారు. స్థానిక రోటరీగంగ భవనంలో నేషనల్ గర్ల్‌చైల్డ్‌డే సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాచరచన ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఎంఈవో శ్రీనివాసరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఇంకొల్లు, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి) : వరుస ఘటనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకొల్లు నుంచి ఒంగోలు చేరుకోవాలంటే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మొన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలకు రెండు మూడు రోజులు ప్రధాన రహదారి పాతమద్రాసు రహదారిలో వంకాయలపాడు, దుద్దుకూరు గ్రామాల వద్ద వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం మోది సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో బస్సులు లేక ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. ఇంకొల్లు నుంచి చీరాల, చిలకలూరిపేట, గుంటూరు, ఒంగోలు చేరుకునేందుకు అవస్థలు పడ్డారు. దీంతో ఇంకొల్లు బస్టాండు గురవారం బస్సులు లేక వెలవెలబోయి కనిపించింది .కేవలం నాలుగైదు బస్సులు మాత్రమే తిరగడంతో ప్రయాణికులు గమ్యస్థానాలు చేరేందుకు ఇబ్బందులు పడ్డారు.


నిర్మానుష్యంగా ఉన్న ఇంకొల్లు బస్టాండు

బైకు ట్యాంక్ కవర్‌లోని నగదు అపహరణ

బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకొని ఇంటికి వెళ్తుండగా ఘటన

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణం డబ్బులు మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచగా, ఆ నగదు అపహరణకు గురైంది. ఈ ఘటన అద్దంకి పట్టణంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపుర అగ్రహారానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి గురువారం మధ్యహ్నం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం రోడ్డులోని బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి రూ.1.40 లక్షల రుణం తీసుకున్నాడు. నగదును మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్ లో పెట్టి నామ్ రోడ్డు లో పోతురాజుగండి వద్ద ఉన్న ఆటోమొబైల్ షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.1.40 లక్షల నగదు మాయమైంది. దీంతో బాధితుడు వెంకటేశ్వరరెడ్డి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలో దొంగలు బ్యాంకు వద్ద మాటు వేసి తరచూ ఇదే తరహా దొంగతనాలకు పాల్పడుతున్నారు.

వీధి కుక్కల దాడిలో 16 పొట్టేళ్లు మృతి

● రూ. 2 లక్షల మేర నష్టం ● బాధితుడి అవేదన


వీధి కుక్కల దాడిలో మృతి చెందిన పొటేళ్లు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో గురువారం షేక్ వలి అనే రైతుకు చెందిన 16 పోటేళ్ల పిల్లలు వీధికుక్కల దాడిలో మృతి చెందాయి. అందిన సమాచారం మేరకు కొప్పెరపాడు ముస్లీం కాలనీకి చెందిన షేక్ వలి పోటేళ్ల పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా పోటేళ్ల మందపై దాడి చేయటంతో 16 పోటేళ్లు మృతి చెందాయి. మృతి చెందిన పోటేళ్ల విలువ రూ. 2 లక్షల మేర ఉంటుందని బాదిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని అయన కోరారు.

ఏబీసీ కాలువ వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్నప్రమాదం

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామ పరిధిలోని అద్దంకిబ్రాంచ్ కాలువ వంతెన వద్ద వ్యవసాయ విద్యుత్ లైన్ ఒరిగింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలల నుంచి విద్యుత్ తీగల సపోర్టుతో విద్యుత్ స్తంభం నగానికి వాలి ఉందని ప్రతిరోజు పంట పొలాలకు వెళ్లే రైతులు ఈ స్తంభాన్ని చూసి భయపడుతున్నారు. ఈ స్తంభం పడితే విద్యుత్ లైన్ మెత్తం బ్రేక్ అవుతుందని రైతులు తెలిపారు. కొమ్మినేని వారిపాలెం నుంచి అంబడిపూడి వెళ్లే మెయిన్ రోడ్డు ప్రక్కనే ఈ స్తంభం ఉందని బాటసారులు కూడా నిత్యం వెళుతుంటారని ప్రమాదం జరగక ముందే అధికార్లు విద్యుత్ స్తంభాన్ని సరిచేయించాలని రైతులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా వాలి ఉన్న విద్యుత్ స్తంభం

విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యం : ఏపీటీఎఫ్


ప్రమాణం చేస్తున్న నూతన మండల కార్యవర్గం

పంగులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తోందని జిల్లా కమిటీ సభ్యులు కంకణాల శ్రీనివాసరావు, చేజర్ల చెంచురామారావు, రాష్ట్ర కౌన్సిలర్ జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. ఏపీటీఎఫ్ మండలశాఖ సర్వసభ్య సమావేశం తన్నీరు వెంకట్రావు అధ్యక్షతన పంగులూరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తన్నీరు వెంకటరావు, షేక్ రహంతుల్లా, ఉపాధ్యక్షులుగా పోతుగంటి ఆంజనేయులు, కె.మనోహర్, బాచిన లక్ష్మీసులోచన, కార్యదర్శులుగా తానికొండ ప్రమీల, దాసరి శ్రీనివాసరావు, గింజిపల్లి శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా జంపని వెంకటేశ్వర్లు, కె.వి.కె.నరశింహమూర్తి, కె.శ్రీనివాసరావు ,బి.లలితకుమారి, ఆర్.వి.సుబ్బారావు, చెంచురామారావులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కరి రామయ్య వ్యవహరించారు. సీనియర్ ఉపాధ్యాయులు పూసల రామారావు, కె.శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నత్రజని, పొటాషియం పెంపు

● ఏరువాక కేంద్రం సమన్వయకర్త అచ్యుతరాజు


ఏరువాక కార్యక్రమంలో అధికారులు, రైతులు

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాగులో రైతులు జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నత్రజని, పొటాషియం శాతం పెరుగుతుందని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.అచ్యుతరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని తోటవారిపాలెం రైతుసేవా కేంద్రం వద్ద ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక దిగుబడులు సాధించాలంటే జీవన ఎరువుల వినియోగం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రేపు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొనున్నారు. ఉదయం 10 గంటలకు కొరిశపాడు మండలం తమ్మవరంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, 11 గంటలకు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ, మధ్యాహ్నం 12 గంటలకు అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

సూపర్ జీఎస్టీతో సామాన్యులకు సూపర్ సేవింగ్స్


చీరాలలో అధికారుల అవగాహన ర్యాలీ

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సూపర్ జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు మేలు చేకూరుతుందని స్టేట్ అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు, స్టేట్ ట్యాక్స్ అధికారి జమీర్ అహ్మద్, మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వాహనాల కొనుగోలుపై తగ్గిన మొత్తాలను వివరించారు. అలాగే బీమా వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్‌లు, వాహన దారులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీ తగ్గింపు చర్యతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని చీరాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. రవాణాశాఖ అధ్వర్యంలో తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్ మాట్లాడుతూ చిన్న తరహా వాహనాలపై ప్రభుత్వం జీఎస్టీ 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించిందన్నారు. ఇవే కాకుండా నిత్యావ సరవస్తువులు, గృహోపకరణాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై కూడా జీఎస్టీ తగ్గించారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎస్సై జీవీ.చౌదరి కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ట్రైనీ ఎస్సై గోపీ, ఏపీ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్.షంషుద్దీన్, కోటా నాగభూషణం, షేక్. ఫిరోజ్ బాషా, సుబ్బారావు, వాహనాల షోరూం నిర్వహకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది. ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకి : అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా సూపర్ జీఎస్టీ శ్లాబుల సవరణ ఉందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు నామ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీకి తహసీల్దార్ శ్రీచరణ్ జెండా ఊపి ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతూ ఒక దేశం-ఒకే పన్ను విధానంతో జీఎస్టీ తగ్గింపు ఫలాలు అందుతున్నాయన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, సీఐ సుబ్బరాజు, అసిస్టెంట్ ఎంవీఐ కిషోర్, మన్నం త్రిమూర్తులు, దూళిపాళ్ల సుబ్బారావు, నరేంద్ర, అంకమ్మరావు, ఆటోయూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రవర్తి రాంబాబు, రాజా, తిరుపతయ్య, దస్తగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు







నెల్లూరు : ఎస్-2 థియేటర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సండే మార్కెట్‌లో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

ఈశాన్య వానలు

- నగరంలో రోడ్లపై ప్రవహించిన డ్రైనేజీ నీరు
- ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రానున్న మూడు రోజుల్లోనూ వర్షాలు ?

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై డ్రైనేజీ నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా నగరంలోని పంటకాలువలు చెత్తాచెదారాలతో నిండి పోవటంతో వర్షపు నీరు ముందుకు కదల్లేదు. వర్షాలు కురుస్తాయని తెలిసీ కూడా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. దీంతో రోడ్లమీద డ్రైనేజీ నీరు పారింది. రానున్న మూడురోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

సగటు వర్షపాతం 22 మిమీ

జిల్లాలో గురువారం సగటు వర్షపాతం 22 మి.మీ.గా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా అల్లూరులో 56.4 మి.మీ, అత్యల్పంగా దుత్తలూరులో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. కోవూరులో 47.4, ఉలవపాడులో 46.6, పొదలకూరులో 44.2, నెల్లూరు అర్బన్‌లో 38.4, నెల్లూరు రూరల్‌లో 36.6, బోగోలులో 23.6, వెంకటాచలం 23.4, కావలిలో 22.4, కొండాపురంలో 16.2, ఆత్మకూరులో 14.8,ఉదయగిరిలో 5.8 మి.మీ వర్షపాతం నమోదు అయింది.

ఈశాన్య రుతుపవనాల ప్రవేశం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. తొలిరోజే భారీ వర్షం కురిసింది.దీంతో వ్యాపారులు, ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు, సామాన్యులు బయట తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీనికితోడు విద్యుత్‌శాఖ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో జనం అసహనానికి గురయ్యారు.



వర్షానికి నిర్మానుష్యంగా ఉన్న నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్

ఇలా ఎందుకు చేశారు..?

- క్యూసీ సర్టిఫికెట్‌ను దిద్దాల్సిన అవసరమేంటి...
- ప్రీక్లోజ్ అయ్యాక రివైజ్ ఎందుకు చేశారు..
- పెన్నా ప్యాకేజీ-1 వర్కుపై విజిలెన్స్ విచారణ
- 15 మంది ఇరిగేషన్ అధికారులపై ప్రశ్నల వర్షం
- త్వరలో ఎస్ఈ, సీఈ, పీఏవో అధికారులకు పిలుపు

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనులపై విజిలెన్స్ విచారణ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రికార్డులన్నింటినీ పరిశీలించి అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. చివరగా అందుకు బాధ్యులైన ఇరిగేషన్ అధికారులపై విచారణ మొదలుపెట్టారు. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్(క్యూసీ)ను నిబంధనలకు విరుద్ధంగా దిద్దడం, రిక్విజిషన్ లేకపోయినా అమాంతం క్యూసీ సర్టిఫికెట్‌లో బిల్లు మొత్తాన్ని పెంచడం, ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక అంచనాలు రివైజ్ చేయడం, నిబంధనలకు మించి బ్యాంక్ గ్యారెంటీ కమిషన్ చార్జీలు డ్రా చేసుకోవడం వంటి అనేక అంశాలను విజిలెన్స్ విభాగం లోతుగా విచారించింది. ఈ క్రమంలోనే అనేక లోటుపాట్లను గుర్తించింది. రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ఇరిగేషన్ అధికారులు సహకరించారన్న నిర్ధారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు ఇప్పుడు ఇరిగేషన్ సిబ్బందిని విచారణకు పిలుస్తున్నారు. తొలుత ఇరిగేషన్ నెల్లూరు సెంట్రల్ డివిజన్ అధికారులు, సిబ్బంది నోటీసులు అందుకున్నారు. ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలు, ఆరుగురు ఏఈలు, ఐదుగురు అకౌంట్స్, టెక్నికల్ అధికారులకు నోటీసులు అందాయి. వీరంతా బుధవారం నెల్లూరులోని విజిలెన్స్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనేక ప్రశ్నలను విజిలెన్స్ అధికారులు వీరి ముందుంచారు. ఎవరి పాత్రకు తగ్గట్లుగా వారిని ప్రశ్నించారు. క్యూసీ సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేస్తే మీరెలా అనుమతించారంటూ అకౌంట్స్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఎందుకు బిల్లును సరిగ్గా స్ర్కూటినీ చేయలేదని టెక్నికల్ సిబ్బందిని అడిగినట్లు సమాచారం.

బిల్లులెలా చేశారు...?

ఇక ఏవిధంగా ఈ బిల్లులు తయారు చేశారు..? ఎందుకు క్యూసీ సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేయాల్సి వచ్చింది..? వర్కు ప్రీక్లోజ్ అయ్యాక ఎలా రివైజ్ చేశారు..? ఇందుకు ప్రతిపాదనలు ఎవరు పంపారు..? బీజీ కమీషన్ చార్జీల వ్యవహారమేమిటి..? వంటి అనేక ప్రశ్నలను ఇంజనీర్ల ముందుంచినట్లు తెలిసింది. విచారణకు హాజరైన వారంతా లిఖిత పూర్వకంగా వారి సమాధానాలను తెలియజేశారు. ఇంతమంది అధికారులు ఒకే రోజు విచారణకు హాజరవడం ఇరిగేషన్ శాఖలో ఇదే తొలిసారి అని చర్చించుకుంటున్నారు. అయితే త్వరలోనే మరి కొంతమందిని కూడా విజిలెన్స్ అధికారులు విచారణకు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రివైజ్‌కు ప్రొపోజల్ పెట్టిన ఎస్ఈ కార్యాలయం, దానిని అప్రూవ్ చేసిన సీఈ కార్యాలయం అధికారులతో పాటు ఈ బిల్లులను అప్‌లోడ్ చేశాక ఆమోదించిన పేఅండ్అకౌంట్స్(పీఏవో) అధికారులను కూడా త్వరలోనే విచారణకు పిలవనున్నట్లు సమాచారం అందుతోంది. పెన్నా ప్యాకేజీ-1 వర్కు కాంట్రాక్టర్ వైసీపీకి చెందిన ఓ ముఖ్య నేత కావడం గమనార్హం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ఈ వర్కు ప్రీక్లోజ్ జరిగిందని, రూ.కోట్లు ప్రజాధనాన్ని దోచుకునేందుకు స్కెచ్ వేశారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫిర్యాదులు అందాయి. దీంతో సీఎఫ్ఎంఎస్ నుంచి ప్యాకేజీ-1 వర్కు బిల్లులను వెనక్కు తెప్పించారు. ఆ తర్వాత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దాదాపు ఆరు నెలల నుంచి జరుగుతున్న విజిలెన్స్ విచారణ చివరి దశకు చేరుకుంది. ఈ నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశాలున్నట్లు విజిలెన్స్ వర్గాలు చెబుతున్నాయి.





రైతు ఉత్పత్తి సంఘాలు
బలోపేతం కావాలి

- కలెక్టర్ హిమాన్షుశుక్లా

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణను సద్వినియోగం చేసుకుంటూ, సరికొత్త ఆలోచనలతో రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీవోలు) బలోపేతం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో గురువారం ఎఫ్‌పీవోల పురోగతిపై ఏడవ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 108 ఎఫ్‌పీవోలు పనిచేస్తున్నాయని,వీటిని 150కి పెంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ ఎఫ్‌పీవోలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందించేందుకు అవసరమైన జీఎస్టీ, ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ ఆఫ్ ఇండియా(ఫాసీ) లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఈప్రక్రియ అంతా డిసెంబరు 15నాటికి సిద్ధం చేయాలన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చడమే ఎఫ్‌పీవోల లక్ష్యం కావాలన్నారు. ఛాంపియన్ ఫార్మర్, ఎఫ్‌పీవోలను అనుసంధానం చేస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఎఫ్‌పీవో పరిధిలో రైతుల అవసరాల మేరకు వ్యవసాయ యంత్రపరికరాలు కొనుగోలు చేయాలని, అందుకు బ్యాంకులు సహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నెదర్లాండ్స్‌లో పండ్లు, కూరగాయలు, పాలను విజయవంతంగా ఎగుమతి చేయడం, టమోటా సాగులో వినియోగిస్తున్న సాంకేతికత, ఆదాయం వంటి స్ఫూర్తివంతమైన సందేశాత్మక వీడియోలను ప్రదర్శించి, కలెక్టర్ అందరినీ చైతన్యపరిచారు. అనంతరం ఎఫ్‌పీవోలు తయారు చేసిన కొబ్బరినూనె, తినుబండారాలను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో డీఏవో సత్యవాణి, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, శాంతి, నాబార్డు డీడీఎం బాబు, వ్యవసాయాధికారులు, ఎఫ్‌పీవోల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన అధికారులు



విజయవాడలోని విద్యుత్ భవన్ ముందు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

కొనసాగుతున్న ఆందోళన

- ప్రభుత్వంతో నేడు విద్యుత్ ఉద్యోగుల చర్చలు
- సమ్మెపై ఉత్కంఠ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. 20కిపైగా డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో తెలుగునాడు యూనియన్ మినహా మిగతా అన్నీ యూనియన్లు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. గతనెల 15 నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టారు. విద్యుత్ సంస్థ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఈనెల 15 నుంచే సమ్మె నిర్వహిస్తామని ముందస్తు నోటీసులు ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ప్రధాని పర్యటన ఉండడంతో సమ్మెను 17వ తేదీకి వాయిదా వేసుకున్నారు.

దశలవారీ ఆందోళనలు

గతనెల 15,16న నల్లబ్యాడ్జీలతో నిరసన, గతనెల 17,18న సర్కిల్, సబ్‌స్టేషన్ల కార్యాలయాల ముందు భోజన విరామసమయంలో ఆందోళనలు, 20,22తేదీల్లో రిలే నిరాహారదీక్షలు, ర్యాలీలు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి సానుకూల స్పందన రాకపోవడంతో తిరుపతి, విజయవాడల్లోనూ ధర్నాలు నిర్వహించి ఈనెల 15న సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలో గురువారం ప్రధాని పర్యటన ఉండడంతో చర్చలను శుక్రవారానికి వాయిదా వేయాలని ప్రభుత్వం కోరింది. దీనికి యూనియన్ నేతలు సమ్మతించారు. ఈ క్రమంలో శుక్రవారం జరిగే చర్చలపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

డిమాండ్లు ఇవే...

విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్యం ఖర్చులు సంస్థే చెల్లించాలి. జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి నుంచి 2004 ఆగస్టు వరకు నియమాకం అయిన ఉద్యోగులందరికీ వర్తింపచేయాలి. కాంట్రాక్టు లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను యాజమాన్యమే నేరుగా చెల్లించాలి. దీర్ఘకాలిక సర్వీసు ఉన్నవారందరినీ సంస్థలో విలీనం చేయాలి. కారుణ్య నియామకాలు కల్పించడంలో కన్సల్టెంట్ ఇస్తున్న పేపద్ధతిని రద్దు చేయాలి. ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ జేఎల్‌ఎంలుగా పరిగణించి, వేతనాలు, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. సర్కిల్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలను పునరుద్ధరించాలి.

పీఎం కిసాన్ లబ్ధిపొందేందుకు
యూనిక్ ఐడీ ఉండాల్సిందే!



నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయానికి ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు.2019 ఫిబ్రవరికి ముందు రైతు పేరున పొలం ఉండాలని, ఫిబ్రవరి ఒకటి నాటికి ఉన్న రైతుల జాబితా ఆధారంగా కంప్యూటర్ ద్వారా రిజిస్టర్ అయిన వారిని మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. రిజిస్టర్ అయిన రైతు చనిపోతే... అతని వారసులకు వారసత్వంగా వచ్చిన భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ ద్వారా పీఎం.కిసాన్ హోం పేజీ లోదరఖాస్తు చేసుకున్న రైతులు వివిధ కారణాలతో రిజెక్ట్ చేయబడ్డారని తెలిపారు. వీరు సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకునేందుకు పీ.ఎం కిసాన్ హోం పేజీలో అప్డేట్ మిస్సింగ్ ఇన్ఫర్మేషన్, ఎడిట్/ అప్డేట్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ అనే ఆప్షన్స్ ఇచ్చి ఉన్నారని ఆమె వివరించారు. కావున అనర్హులుగా ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈకేవైసీ లేని కారణంగా 927 మంది, బ్యాంకు లింకేజీ లేని కారణంగా 3376 మంది, ఫిజికల్ వెరిఫికేషన్‌కి అందుబాటులో లేకపోవడం వల్ల 3300 మంది కలిపి మొత్తం 6466 మంది పీఎం కిసాన్ పథకానికి అనర్హులుగా తేలారని తెలిపారు. వీరంతా పీ.ఎం కిసాన్ యాప్ ద్వారా లేదంటే, సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. వివరాలు సరిచేసుకున్న రైతులు 21వ విడత లబ్ధికి అర్హులవుతారని ఆమె తెలిపారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీలు



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై కావలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై గురువారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు, కరపత్రాల పంపిణీ జరిగింది. కావలి, కందుకూరు, బుచ్చి, ఉదయగిరి, కోవూరు, వెంకటాచలంలో అధికారులు ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగిన ప్రయాజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ, రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- వివరాలు లోపలి పేజీల్లో...

రాళ్లపాడు గేట్ల
ట్రయల్‌రన్

- నీటి విడుదలకు సిద్ధం చేసిన ఇరిగేషన్ అధికారులు
- గత అనుభవాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల గేట్లను ప్రాజెక్టు అధికారులు సిద్ధం చేస్తున్నారు.ప్రాజెక్టు డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది గురువారం కుడి, ఎడమ కాలువల గేట్లకు గ్రీజు పెట్టించారు.అనంతరం ట్రయల్‌రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండినా, లేక సోమశిల జలాలు ప్రాజెక్టులోకి వచ్చినా, ఆయకట్టుకు గేట్ల ద్వారా నీరు విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.ప్రస్తుతం ప్రాజెక్టులో 10 అడుగుల నీటిమట్టం ఉన్నట్టు తెలిపారు. కాగా రెండేళ్ల క్రితం ప్రాజెక్టు ఎడమ కాలువ గేటు కాలువకు నీరు విడుదల చేసే సమయంలో మధ్యలో ఇరుక్కుపోయింది. అప్పట్లో అధికారులు మెకానిక్‌ల ద్వారా గేటును బాగు చేయించి నీటిని విడుదల చేశారు.అలాగే గత ఏడాది డిసెంబరులో కుడి కాలువ గేటు కూడా కిందకు దిగిపోయి, పైకి లేవలేదు. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నిపుణులైన ఇంజనీరింగ్ అధికారులు, మెకానిక్‌లను పిలుచువచ్చి ఈ గేటును బాగు చేయించారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి రాకూడదని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

సోమశిలకు 11,110 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 11,110 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 73.611 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

కండలేరులో నీటి నిల్వ 59.910 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.910 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 4000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2800 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటుకు గ్రీజు పెడుతున్న ఇరిగేషన్ సిబ్బంది

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థలం పరిశీలన

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల ఆటస్థలాన్ని గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. సబ్ కలెక్టరు హిమవంశీ, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ లావణ్య, సీఐ అన్వర్‌బాషా, మున్సిపల్ కమిషనర్ అనూష, ఎస్ఐ శివనాగరాజు, అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణాల ఏర్పాటు, విక్రయాల సమయంలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై సూచనలు చేశారు.



నిబంధనల మేరకే టపాసులు విక్రయించాలి

అల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకే టపాసులు విక్రయించాలని డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. టపాసుల విక్రయదారులతో ఆయన గురువారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మైదాన ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక టపాసుల వ్యాపారులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు ఏర్పాటుచేసినా, నిల్వచేసినా, టపాసుల విక్రయానికి అంగళ్లు సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా ఏర్పాటుచేస్తే, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం నారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి లైసెన్స్ పొంది, వారు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి అమ్ముకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవన్నారు.

లోకాయుక్త చైర్మన్‌ను నియమించాలి

కావలి (టౌన్) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోకాయుక్త చైర్మన్‌ను వెంటనే నియమించాలని లోక్ అదాలత్ సభ్యుడు, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. అవినీతిని నియంత్రించడానికి ఏర్పాటైన లోకాయుక్త చైర్మన్ పోస్టు ఖాళీగా ఉండడంతో అవినీతిని అరికట్టడంలో, సత్వర న్యాయం పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు.

వర్షంతో రోడ్లు జలమయం

లింగసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి పలు గ్రామాలలోని అంతర్గత రోడ్లు, వీధులు, ప్రధాన రహదారులు, ఆర్అండ్ రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షం పొగనారు, జొన్నమేత పైర్లకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బస్సు యాత్ర

- ఏఐఎస్ఎఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహించే బస్సు జాతను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్‌షరీఫ్ కోరారు. నగరంలోని రామకోటయ్యనగర్ జిల్లా కార్యాలయంలో యాత్రకు సంబంధించిన గోడపత్రికను గురువారం విడుదల చేసి మాట్లాడారు. విద్యారంగంలో ఎన్నో సమస్యలు నెలకొన్నా ప్రభుత్వం వాటిని పరిష్కరించడం లేదన్నారు. మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించాలన్నారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే జీవో నెం 77ను రద్దు చేయాలని, విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ జరిగే బస్సు జాతాను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 3వతేదీన యాత్ర జిల్లాలోకి, నగరంలోకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శివంవర్మ, సోహిల్, అబ్దుల్ వికాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ భ్రష్టాండ్!

- ప్రాంగణంలోనే మూత్ర విసర్జన
- కంపుకొడుతున్న కాలువలు
- మడుగు కట్టిన వర్షపు నీరు
- అపరిశుభ్రతతో ప్రయాణికుల అవస్థ



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీరు



వినియోగంలో లేని మూత్ర విసర్జన శాల

కావలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం అపరిశుభ్రతకు అడ్డానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవటంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అపరిశుభ్రతతోనే ఎక్కువగా రోగాలు వచ్చే అవకాశాలు ఉండటంతో పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. కానీ కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో అందు కు భిన్నమైన పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం పడినా బస్టాండ్ ఆవరణంలో పడమర వైపున రోజుల తరబడి నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా ప్రయాణికులు ఆ నీటి మడుగు తొక్కుకుంటూ రాకపోకలు సాగించక తప్పడంలేదు. అలాగే బస్టాండ్ ఆవరణంలో ఉన్న డ్రైనేజీ కాలువల్లో నీరు సక్రమంగా పోకుండా అక్కడ కంపు కొడుతోంది. దీంతో అక్కడ మూత్ర విసర్జన చేయకూడదని ఆర్టీసీ అధికారులు బోర్డు పెట్టారు. అయితే మూత్ర విసర్జనకు నూతనంగా నిర్మించిన మూత్రవిసర్జనశాల నిర్మాణం పూర్తి అయినా దానిని వినియోగించకుండా అడ్డుగా కంప వేశారు. దీంతో ప్రయాణికులు మూత్రవిసర్జన ఆరుబయట డ్రైనేజీ కాలువ వద్దనే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. దీని వలన రోగాలు వచ్చే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన మూత్రవిసర్జన శాలను ప్రారంభించి ఆరుబయట మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే డ్రైనేజీ నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

అవగాహన ర్యాలీలో వక్తలు

కావలి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణ పేద, మధ్యతరగతి వర్గాలకు ఓ వరమని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్‌సేవింగ్స్‌పై కావలి రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలో మోటారు సైకిళ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ ర్యాలీని ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ట్రాక్టర్లు, వాటి విడి భాగాలకు తగ్గిన జీఎస్టీ వల్ల రూ.10 వేల నుంచి 1.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. వాహనాలకే కాకుండా అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించినందున ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. దీంతో రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల రాబడి తగ్గిపోతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు జీఎస్టీ సంస్కరణలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రవాణాశాఖ అధికారి మురళీధర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, బీజేపీ నాయకుడు వీవీ రంగారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ రావు



కందుకూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టరు హిమవంశీ, అధికారులు

- **కందుకూరులో ర్యాలీ**

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కందుకూరు ఆర్డీవో టీవీఎస్ లక్ష్మి నేతృత్వంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి ర్యాలీని సబ్ కలెక్టరు దామెర హిమవంశీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబుల విధానాన్ని రద్దుచేసి రెండు శ్లాబులకు పరిమితం చేయటం వలన రైతులు, సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్ఐ శివనాగరాజు, ఎంవీఐ జె. అనిల్‌కుమార్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాది, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నవంబరు 3న సమ్మె



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మిక నాయకులు

కావలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నవంబరు 3న సమ్మె చేస్తున్నామని గురువారం యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎండ్లూరి ఆదినారాయణ, మల్లె అంకయ్య, సీపీఐ నాయకుడు దమ్ము దర్గాబాబు కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. 12వ పీఆర్సీని ప్రకటించి, మధ్యంతర భృతిని 30 శాతం ఇవ్వాలన్నారు. గత రెండేళ్లలో విధి నిర్వహణలో మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులను, దినసరి వేతన కార్మికులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలన్నారు. బకాయిలు సత్వరమే చెల్లించి, పట్టణ జనాభాకు తగినట్లు కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు.

మేఘన కుటుంబానికి అండగా ఉంటాం

కలిగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కలిగిరి- కొండాపురం మార్గంలో తెల్లపాడుక్రాస్ రోడ్డువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులతోపాటు సోదరిని కోల్పోయిన చదలవాడ మేఘన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోర్‌వెల్ లారీ కింద పడి తీవ్రంగా గాయపడిన మేఘనకు అత్యవసర చికిత్స అందించాలని ఎమ్మెల్యే కిమ్స్ వైద్యాధికారులకు సూచించారు. మృతుల కుటుంబానికి అండగా నిలవాలని మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డితోపాటు తూర్పు దూబగుంట టీడీపీ నాయకులు పిచ్చపాటి చలపతిరెడ్డి, హజరత్‌రెడ్డి, మాలకొండారెడ్డి, పవన్‌కళ్యాణ్, శివరామయ్య తదితరులకు సూచించారు. బాధితకుటుంబ సభ్యులకు కాకర్ల ఛారిటబుల్ ట్రస్టు తరపున టీడీపీ నాయకులు తూర్పు దూబగుంటలో రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అవినీతి రహితంగా రీసర్వే చేయాలి

అల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను అవినీతి రహితంగా చేపట్టాలని రైతులు స్పష్టం చేశారు. గురువారం అల్లూరు మండలం సింగపేట సచివాయంలో అధికారులను స్థానిక రైతులు ఈ మేరకు నిలదీశారు. స్థానిక రీసర్వే అధికారులు అవినీతికి పాల్పడడం సరికాదని వారు ఆరోపించారు. రీసర్వే చేపట్టాల్సిన భూముల రైతులకు సరైన సమయం తెలియజేయడం లేదన్నారు. అధికారులు వచ్చే సమయాన్ని ముందుగా తెలియజేస్తే అందుబాటులో ఉండేందుకు అవకాశం ఉంటుందని రైతులు అన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ ఏవి రాధాదేవి సూచించారు. గురువారం మండలం లోని పెదపవని-1 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వలేటివారిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని మంగళపాలెంకు వెళ్లే ప్రధాన రహదారిని ముళ్లచెట్లు కమ్మేశాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాలలో నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్డును ముళ్లచెట్లు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు సైడొలిగే సమయంలో ముళ్లచెట్లు తగిలి ప్రయాణికులకు గాయాలవుతున్నాయని, అంతేగాకుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లచెట్లను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



వలేటివారిపాలెం : మంగళపాలెంకు వెళ్లే రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు

శిథిలావస్థలో పాఠశాలల భవనాలు

- పొంచి ఉన్న ప్రమాదాలు

వలేటివారిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుకుపాలెం, గాంధీనగర్, మాలకొండ, పెదఅమ్మపాలెం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులు పాఠశాల విరామ సమయంలో శిథిల భవనాలలో ఆడుకుంటుంటారు. అలాంటి సమయంలో భవనాలు కూలిపోతే ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వర్షాకాలంలో శిథిల భవనాల్లోని గోడల్లోకి వర్షం నీరు చేరి కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత విద్యాశాఖాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే శిథిల భవనాలను కూల్చివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





ఆకర్షణీయంగా దీపావళి ప్రమిదలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్వకాంతుల దీపావళి పండుగ నుంచి కార్తీక మాసం వరకు ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగించి తమ తమ ఇష్టదైవాలకు ఆరాధనలు చేస్తారు. ఈ క్రమంలో దీపావళి పండుగ ఏర్పాట్లపై జనం దృష్టి సారించారు. ప్రతి కుటుంబం ఈ మాసంలో ప్రమిదలలో జ్యోతులు వెలిగించాల్సిందే. అల్లా దీపాలు వెలిగించడమే దీపావళి పండుగ కళ. దీంతో ఈ సీజన్‌లో మట్టి ప్రమిదలు వ్యాపారం



జోరుగా సాగుతోంది. ఏటా దాదాపు లక్షలాది ప్రమిదలు జిల్లా ప్రజలు వినియోగిస్తారు. అందుచేత వ్యాపారాలు తమిళనాడు, కేరళ, తదితర ప్రాంతాల నుంచి వీటిని కొనుగోలు చేసి ప్రజలకు విక్రయిస్తుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల ఆకర్షణీయమైన ప్రమిదులు దర్శనమిస్తున్నాయి. కొబ్బరికాయ, రంగురంగుల డిజైన్లు, దేవుళ్ల బొమ్మల ఆకృతిలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటి ధర రూ.1.50 నుంచి రూ.200 పైగా పలుకుతున్నాయి. అయినా ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం విశేష నందిపూజ, ద్వితీయ, తృతీయ కాలయాగశాల పూజ, రాత సమర్పణం, విశేష హోమ ద్రవ్యాలతో హోమం, పూర్ణాహుతి, దీపారాధన, పవిత్ర సమర్పణం, ద్వితీయ కాల పవిత్ర సమర్పణం, తదనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా డాక్టర్ ఓ.గోపాలకృష్ణ, అంజనీ, మద్దిన విశ్వనాధం, భావన లక్ష్మి, తదితరులు వ్యవహరించారు.



మూలస్థానేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు సమర్పిస్తున్న వేద పండితులు

ట్రామా కేర్ ఏది?

జిల్లాలో నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలతోపాటు ఇతరత్రా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి అత్యవసర వైద్య చికిత్సలు చేయాలి. అయితే జిల్లాలో ట్రామాకేర్ (ప్రమాదాలలో గాయాలు, ప్రకృతి విపత్తులు) వైద్య చికిత్సలు ఆశించిన స్థాయిలో అందడం లేదు. ప్రభుత్వపరంగా జీజీహెచ్‌తోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక వైద్యశాలలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్న ఆరోపణలున్నాయి.



ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

- జిల్లాలో ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య నిపుణుల కరువు
- అత్యవసర వైద్యానికి బాలారిష్టాలు
- మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది
- నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పలు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఏటా జిల్లాలో 900లకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిలో 350 మందికిపైగా మృత్యువాత పడుతుండగా 950 మంది వరకు క్షతగాత్రులుగా నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాంటి వారికి అత్యాయిక వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన ఏర్పాట్లు లేవు. నెల్లూరులోని జీజీహెచ్‌లో 2010లోనే ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించినా దాని లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. గత ఏడాది కాలంగా ట్రామాకేర్ సెంటర్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ కేంద్రంలో 57 మంది వైద్యులు, సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 14 మంది స్టాఫ్‌నర్సులు, నలుగురు ఎంఎన్‌వో, నలుగురు ఎఫ్ఎన్‌వోలు మాత్రమే ఉన్నారు. వీరు కూడా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని క్యాజువాలిటీలోనే పనిచేస్తున్నారు. దీంతో ట్రామాకేర్ యూనిట్‌లో వైద్య సేవలు అటకెక్కాయి. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావాలి, కందుకూరు ఏరియా ఆసుపత్రుల్లోనూ ట్రామాకేర్ సెంటర్‌లు లేక పోవటంతో అక్కడ కూడా అత్యవసర వైద్య సేవలకు తీరని విఘాతం కలుగుతోంది.

వైద్య నిపుణులు ఏరి..!

అత్యవసర పరిస్థితిలో వచ్చే రోగులలో 24 శాతం మంది ప్రమాద బాధితులేనని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారిలో 15 నుంచి 35 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రమాదాల్లో ఎక్కువ మందికి తలకు గాయాలవుతుంటాయి. అలాంటి వారిని గంటలోపు ఆసుపత్రికి చేర్చాల్సి ఉంటుంది. దీనిని గోల్డెన్ అవర్‌గా వైద్యులు చెబుతారు. ఆ సమయం లోపు తీసుకువస్తే ప్రాణాపాయం నుంచి గట్టెక్కించే అవకాశం ఎక్కువని నిపుణులు అంటున్నారు. ఇందుకోసం క్రిటికల్ కేర్ వైద్యులతో పాటు న్యూరో సర్జన్, ఆర్థోపెడిక్, కార్డియాక్, రేడియాలజీ వైద్య నిపుణులు అవసరం ఉంటుం ది. అయితే జిల్లాలోని ప్రభు త్వ ఆసుపత్రులలో తగినంత మంది వైద్యనిపుణులు లేరు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గుండె వైద్య నిపుణులు ఉండగా మిగిలిన ఆసుపత్రులలో ఈ స్పెషాలజిస్టులు లేరు. ఈ నేపథ్యంలో జిల్లాలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు అంచనా.

జిల్లాలో ప్రమాదాలు ఇలా...

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021-22	997	466	1006
2022-23	883	494	1088
2023-24	745	354	978
2024-25	902	329	1034
2025-26	847	213	892

ట్రామాకేర్ చికిత్సలు అందిస్తున్నాం



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రామాకేర్ వైద్య చికిత్సలు అందిస్తున్నాము. జీజీహెచ్‌కు రోడ్డు ప్రమాదాల బాధితులే ఎక్కువగా వస్తుంటారు. వారికి వైద్య చికిత్సలు అందిస్తున్నాము. ప్రకృతి వైపరిత్యాల బాధితులకు కూడా మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా కృషి చేస్తున్నాం. ట్రామాకేర్ విభాగాన్ని మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కిరణ్‌కుమార్, జీజీహెచ్ ట్రామాకేర్ నోడల్ అధికారి

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ హిమా న్షు శుక్లా చెప్పారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సాహించాలన్నారు. రాజకీ య పార్టీల నేతలు బూత్ లెవల్ ఏజెంట్ల ను నియమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయ కుమార్, టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి వెంకటశేషయ్య, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ వలన రవాణా రంగంలో కలిగే ప్రయోజనాలను తెలిపే పోస్టర్లు, బ్యానర్‌లను గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన ధరలు తగ్గిన బైక్‌లు, కార్లు వివరాలను రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధరలు తగ్గినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్, ఆర్టీవో ఎండీ మదానీ, ఎంవీఐలు మహమ్మద్ రఫీ, బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లా ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడి యంలో జిల్లా సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ ఆర్చరీ జట్ల ఎంపిక లు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో 1 జనవరి 2008 తర్వాత జన్మించిన వారు, జూనియర్స్ విభాగంలో 1 జనవరి 2005 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొ న్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొ న్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లు విజయవాడలోని సీతాపురం శాతవాహ న కళాశాలలో నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీలలో ఉదయం 8 గంటలకు ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు.

శ్రీగంధం చెట్ల నరికివేత



ఉదయగిరి, అక్టోబ రు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపాన గల గానుగపెంట పల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తోటలో శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. రైతు నారాయణరెడ్డి తన తోటలో శ్రీగంధం చెట్లు పెంచుతున్నాడు. బుధవారం రాత్రి రెండు శ్రీగంధం చెట్లను నరికి అందులో ఒక చెట్టు దుంగలను తీసుకెళ్లారు. దీంతో రైతు నారాయణరెడ్డి తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకొంటున్నాడు.

పాటలతో పోరాటం

- కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలి
- ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాట్యమండలి పాటల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య తెలియచేశారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో ప్రజానాట్య మండలిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ కళారూపాల ద్వారా ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లటమే లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో కళాకారులకు ఆశాజనక ఫలితాలు లేవని చెప్పారు. గతంలో వైఎస్సార్ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గుర్తింపు కార్డులు ఇస్తే పెన్షన్ వంటి సదుపాయాలు కలుగుతాయని తెలిపారు. త్వరలో జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో పర్యటిస్తామని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగుల రమణయ్య మాట్లాడుతూ ప్రజా నాట్యమండలికి పూర్వ వైభవం తీసుకు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ప్రభాకర్, రామరాజు, నల్లూరు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

కొడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొడవలూరు పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామానికి చెందిన ఉదయ్ (17) ప్రైవేటు కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం కళాశాల సిబ్బంది తాళం తీయడంతో గదిలో విద్యార్థి ఉరివేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి కారణాలపై విచారణ చేస్తామని సీఐ సురేంద్రబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంపల్లికి చెందిన ఎగిటీల శ్రీనివాసులు తన కుమారుడు వెంకటయోగేష్ కనిపించడంలేదని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటయోగేష్ ఉదయగిరిలోని ఇంటర్ చదువుతూ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి కనిపించకుండా పోయాడన్నారు.

ప్రతిభాన్వేషణకు కౌశల్ సైన్స్ పోటీలు

- ప్రతి పాఠశాల నుంచి 15 మందికి అవకాశం

నెల్లూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్ ప్రతిభాన్వేషణకు కౌశల్-2025 పోటీలు నిర్వహించనున్నారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది విద్యార్థులు, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్‌కు ఇద్దరు చొప్పున ఆరు మంది విద్యార్థులు కలిపి మొత్తం 15 మంది ఒక్కో పాఠశాల నుంచి పాల్గొనే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ బీవీఎస్‌బీవీ డాట్ ఓఆర్‌జీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభమైంది. ఈనెల 24వతేదీలోగా పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనగలిగిన ఈ పోటీలను విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని వెలికితీయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. 8వతరగతి విద్యార్థులకు వికసిత్ భారత్ కొరకు సుస్థిర, హరిత ఇంధన వనరులు అనే అంశంపై పోస్టర్ తయారీ, 9వతరగతి విద్యార్థులకు సత్యేంద్రనాధ్ బోస్ జీవితం, ఆయన చేసిన కృషి అనే అంశంపై పోస్టర్ తయారీ, 10వతరగతి విద్యార్థులకు ఆంధ్ర వైజ్ఞానిక వైభవం(సంప్రదాయ విజ్ఞానం, ప్రాచీన ఆధునిక శాస్త్రవేత్తలు, వైజ్ఞానిక సంస్థలు) అనే అంశంపై రెండు నిమిషాల వీడియో, షార్ట్ రీల్స్ పోటీలుంటాయి. ఈ పోటీలను పాఠశాలస్థాయిలో 8వతరగతికి నవంబరు 1, 9వతరగతికి నవంబరు 3న, 10వతరగతికి నవంబరు 4న నిర్వహిస్తారు. వీటిలో ప్రతిభ చూపిన వారికి నవంబరు 27, 28వతేదీల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించిన డిసెంబరు 1 నుంచి 5 వరకు జిల్లాస్థాయిలో నగదు బహుమతి ఇవ్వనున్నారు.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో, ఇతర అధికారులు(ఫైల్)

విద్యార్థులను ప్రోత్సహించాలి

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణకు కౌశల్ సైన్స్ పోటీల్లో అన్నీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. దీనికోసంగా ఎస్ఈఆర్టీ నిర్దేశించిన సిలబస్‌లోని అన్నీ అంశాలను విద్యార్థులు చదువుకోవాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సత్తా చాటాలి.

- డీఈవో బాలాజీరావు

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్





'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు





పొలాల వెంబడి పరుగులు